# హైదరాబాద్‌కు నేషనల్ కలినరీ డెస్టినేషన్ అవార్డు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరం.. నేషనల్ కలినరీ డెస్టినేషన్ (ఉత్తమ పాకశాస్త్ర గమ్యస్థానం) అవార్డును సొంతం చేసుకుంది. గోవా వేదికగా సోమవారం జరిగిన ఇండియా టుడే టూరిజం సదస్సులో కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమక్షంలో గోవా సీఎం ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా ఈ అవార్డును రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అందుకున్నారు. కార్యక్రమంలో ఇండియా టుడే గ్రూప్ ఛైర్మన్ అండ్ ఎడిటర్-ఇన్-చీఫ్ అరుణ్ పూరీ, ఎడిటోరియల్ డైరెక్టర్ రాజ్ చెంగప్ప వివిధ రాష్ట్రాల పర్యాటకశాఖ మంత్రులు, పర్యాటక రంగ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, టీజీటీడీసీ ఎండీ గౌతమి పాల్గొన్నట్లు తెలంగాణ పర్యాటక అభివృద్ధి మండలి ఒక ప్రకటనలో తెలిపింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# చెత్త రహిత కాలనీగా చంద్రగిరి నగర్

- చెత్త రహితంగా చంద్రగిరి నగర్‌లో జోనల్ కమిషనర్ పర్యటించి, ప్రశంసలు..
- చంద్రగిరి నగర్‌లో జీవీపీ తొలగింపును పరిశీలించారు..
- స్థానిక ప్రజలను శాలువాలతో సత్కరించిన జోనల్ కమిషనర్..
- కైలాష్ హిల్స్‌లో వాటర్ లాగింగ్‌ను తనిఖీలు చేపట్టారు..
- అదనపు మోటార్ పంపులు సిద్ధం చేయాలని ఆదేశం..
- వర్షాకాలానికి ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలు..

## స్థానికులను సన్మానించి, అభినందించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 15:** గాజులరామారం సర్కిల్ పరిధిలోని చంద్రగిరి నగర్‌లో శాశ్వతంగా తొలగించిన గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ) ప్రాంతాన్ని, సిఎంసి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.. చెత్త పేరుకుపోయే ప్రాంతాన్ని పూర్తిగా చెత్త రహితంగా మార్చి, కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషించిన స్థానిక ప్రజలను ఈ సందర్భంగా ఆయన అభినందించి సత్కరించారు.. అనంతరం కైలాష్ హిల్స్, మల్లారెడ్డి ఆస్పత్రి సమీపంలోని నీటి నిల్వ (వాటర్ లాగింగ్) సమస్యలు తలెత్తే ప్రాంతాలను పరిశీలించారు.. వర్షాకాలం మొత్తం హైడ్రా సిబ్బందితో నిరంతర సమన్వయం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గాజులరామారం పరిధిలో ఎక్కడా నీటి నిల్వ సమస్యలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన అదనపు మోటార్ పంపులను హైడ్రా ద్వారా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.. ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం), డీఈఈ (ఇంజినీరింగ్)తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..



## ఫీల్డ్‌లోకి వెళ్లని ఐఏఎస్‌ల నివేదిక ఇవ్వండి: సీఎస్‌కు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం (జూన్ 15) ముఖ్యమంత్రి

-4 లో




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సీజనల్ వ్యాధులను సమర్థంగా అరికట్టాలి

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**హైదరాబాద్ పెన్ పవర్:** వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను వైద్యులు, సిబ్బంది సమర్థంగా అరికట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో మంత్రి సీజనల్ వ్యాధులపై డీఎంఈ నరేంద్రకుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ "వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే అవి వ్యాప్తి చెందకుండా ముందుగానే అరికట్టడం ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యం. ప్రతి జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పరిస్థితులను

-4 లో



# మోగిన బడి గంట

- పండగ వాతావరణంలో ప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులకు విభిన్నంగా స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- ఉదయం అల్పాహారం అందజేత
- 19న సీఎం చేతుల మీదుగా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** బడిగంట మోగింది. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పలుచోట్ల ప్రభుత్వ ఉపాధ్యాయులు పండగ వాతావరణంలో విద్యార్థులను బడులకు ఆహ్వానించేలా కార్యక్రమా లు నిర్వహించారు. కొన్నిచోట్ల బడులను మామిడి తోరణాలు, రంగు కాగితాలతో అలంకరించి సంప్రదాయబద్ధంగా పూలు చల్లుతూ చిన్నారులకు ఆహ్వానం పలికారు. ఇంకొన్నిచోట్ల బెలూన్లు, చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి స్వాగతం పలికారు. అయితే.. అమావాస్య తదితర కారణాలతో తొలిరోజు హాజరు తక్కువగా నమోదైంది. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో హాజరు సరాసరిన 30 శాతం వరకు నమోదైంది. ముఖ గుర్తింపు హాజరు గణాంకాల ప్రకారం కొన్ని జిల్లాల్లో 10 శాతం లోపు ఉంది. గురుకులాల్లో 20 శాతం వరకు విద్యార్థులు వచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.

కొన్ని ప్రైవేటు పాఠశాలలు సోమవారం తెరుచుకోలేదు. ప్రారంభమైన చోట ఉన్నత తరగతుల విద్యార్థులకే తరగతులు నిర్వహించారు. ప్రాథమిక విద్యార్థులకు ఈ నెల 17 నుంచి తరగతులు ఉంటాయని యాజమాన్యాలు సమాచారమిచ్చాయి.

-4 లో

# మోగిన బడి గంట

-3 పేజి తరువాయి

**ఖమ్మం శాంతినగర్ బడిలో..**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్(అల్పాహారం) పథకం సోమవారం ప్రారంభమైంది. తొలి విడతలో 1,320 విద్యాసంస్థల్లోని 1,44,610 మందికి ఉదయం అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సోమవారం ఎనిమిది జిల్లాల్లో అక్కడి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రారంభించారు. హైదరాబాద్ అల్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ పథకాన్ని ప్రారంభించి.. పిల్లలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. గురుకుల విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సంక్షేమ విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నెలాఖరు నాటికి అందరికీ కిట్లు అందుతాయని విద్యాశాఖ వర్గాల సమాచారం.

**త్వరలో దుస్తుల పంపిణీ...**

సంక్షేమ గురుకుల విద్యార్థులకు ఈనెలాఖరులోగా దుస్తులు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మహిళా సంఘాలు ఇప్పటికే టెస్కో నుంచి వచ్చిన వస్త్రాన్ని దుస్తులుగా కుట్టాయి. గురుకుల విద్యార్థుల దుస్తుల డిజైన్, రంగుల్లో ఎలాంటి మార్పుల్లేకపోవడంతో ఇప్పటికే సిద్ధం చేసిన దుస్తులను ఈనెలాఖరులోగా అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాలను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సందర్శించారు. కస్తూర్బా విద్యాలయంలో మూత్రశాలను శుభ్రం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 517 స్వచ్ఛ భారత్ వాహనాల ద్వారా పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసినట్లు చెప్పారు.

# ఫీల్డ్‌లోకి వెళ్లని ఐఏఎస్‌ల నివేదిక ఇవ్వండి: సీఎస్‌కు సీఎం రేవంత్ ఆదేశం

-3 పేజి తరువాయి

సమీక్ష సమావేశం నిర్వహించారు.

విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్?తో పాటు , వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాలపై నివేదికలను సమర్పించాయి. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలో ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు.

వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ 3 నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

విద్యా, వైద్య విభాగాల్లో

అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్‌సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించినట్లే, జిల్లాల వారీగా వెంటనే సమీక్ష జరపాలని ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు.

జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు.

తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్రణాళికా విభాగాన్ని ఆదేశించారు.


# 140 వాహనాలు, డిజాస్టర్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు హైడ్రాకు రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్ పెన్ పవర్:** 140 వాహనాలు, డిజాస్టర్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు హైడ్రాకు రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైడ్రా పరిధి విస్తరణ, అత్యవసర సేవల అవసరాల దృష్ట్యా కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. తొలి దశలో 50 శాతం వాహనాలు, పరికరాల కొనుగోళ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన 140 వాహనాలు, పరికరాల కొనుగోలుకు రెండో దశలో అనుమతి ఇచ్చింది. డీఆర్ఎఫ్ టీమ్స్ సంఖ్య పెరగడంతో అదనపు వనరుల అవసరం ఏర్పడింది.

21 డీఆర్ఎఫ్ ట్రక్కులు, 2 ఇన్నోవా హైక్రాస్ వాహనాలు,1 ఇన్నోవా క్రిస్టా, 54 స్కార్పియో, 2 ట్రూప్ క్యారియర్ వ్యాన్లు, 2 బస్సులు, 37 బైక్‌ల కొనుగోలు చేయనున్నారు. 21 డీఆర్ఎఫ్ ఎక్విప్‌మెంట్ యూనిట్ల కొనుగోలుకు ఆమోదం లభించింది. ఈ నిధులను 2026–27 బడ్జెట్ నుంచి ప్రభుత్వం కేటాయించనుంది. ఆర్థిక శాఖ సమ్మతితో సోమవారం (జూన్ 15) ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# హైదరాబాద్ పబ్లిక్ కు అలర్ట్: ఈ రూట్లో 3 నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు... ఆల్టర్నేట్ రూట్ చూసుకోండి..!




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉండే రూట్లలో గచ్చిబౌలి–డీఎల్ఎఫ్ రూట్ ఒకటి. ఈ ఏరియాల్లో ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. ఈ రూట్లో ట్రాఫిక్ తగ్గించేందుకు ఫ్లైఓవర్ నిర్మాణం, రోడ్డు విస్తరణ చేపట్టింది ప్రభుత్వం. ఈ క్రమంలో మూడు నెలల పాటు గచ్చిబౌలి–డీఎల్ఎఫ్ రూట్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు పోలీసులు.

ఈ క్రమంలో ఫ్లైఓవర్, రోడ్డు పనులు వేగవంతం చేయాలని.. ట్రాఫిక్ నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్.

ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనుల కారణంగా మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని నిర్ణయించారు. నిర్మాణ పనులను సులభతరం చేయడానికి, ప్రయాణికులకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించడానికి అవసరమైన ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు పోలీసులు. ఈ క్రమంలో వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, సాధ్యమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

నిర్మాణ పనుల వల్ల కలిగే అంతరాయాలను వీలైనంత తగ్గించేందుకు సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టామని.. ప్రణాళిక రూపొందించామని తెలిపారు పోలీసులు.

**ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ నుండి రిలీఫ్:**

రద్దీగా ఉండే గచ్చిబౌలి––డీఎల్ఎఫ్ మార్గంలో ఫ్లైఓవర్, రోడ్డు అభివృద్ధి పనుల వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని కమిషనర్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, హైదరాబాద్ ఐటీ కారిడార్ గుండా రోజూ ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులకు వేగవంతమైన, సులభమైన కనెక్టివిటీ లభిస్తుందని అన్నారు.

# సీజనల్ వ్యాధులను సమర్థంగా అరికట్టాలి

-3 పేజి తరువాయి

నిరంతరం పర్యవేక్షించాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులన్నీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలి. సీజనల్ వ్యాధుల లక్షణాలతో వచ్చే ప్రతి వ్యక్తికి ఆలస్యం కాకుండా చికిత్స అందించాలి' అని ఆదేశించారు.

## మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి వినియోగదారుల కమిషన్ జరిమానా

**హైదరాబాద్ పెన్ పవర్:** కోర్సు మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థి ఒరిజినల్ సర్టిఫికెట్లను తమవద్దే ఉంచుకొని.. అదనపు ఫీజు కడితేనే ఇస్తామంటూ వేధించిన మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్–1 జరిమానా విధించింది. ఆ విద్యార్థికి రూ.లక్ష పరిహారంతోపాటు రూ.10,000 కోర్టు ఖర్చులు చెల్లించాలని ఆదేశించింది. నాంపల్లికి చెందిన రాకేష్‌వర్మ కుమారుడు 2021 అక్టోబరులో మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (ఏఐ, మెషిన్ లెర్నింగ్) కోర్సులో చేరారు. మొదటి సంవత్సరం ట్యూషన్ ఫీజు కింద రూ.80 వేలు చెల్లించారు. అడ్మిషన్ సమయంలో అతని పదో తరగతి, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీ సిబ్బంది తీసుకున్నారు. తర్వాత ఆర్థిక ఇబ్బందులు తీవ్రమవడంతో కుటుంబ పరిస్థితుల కారణంగా మొదటి సెమిస్టర్ పూర్తయిన తర్వాత విద్యార్థి చదువును కొనసాగించలేకపోయారు.

దీంతో ఒరిజినల్ సర్టిఫికెట్లు తిరిగివ్వాలని విద్యార్థి, అతని తండ్రి కాలేజీ చుట్టూ తిరిగారు. అదనంగా రూ.80 వేలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యం పేర్కొంది. దీంతో విద్యార్థికి నాలుగు విద్యా సంవత్సరాలు వృథా అయ్యాయి. కాలేజీ వేధింపులపై ఆ విద్యార్థి గతేడాది సెప్టెంబరులో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. అయితే కమిషన్ నుంచి నోటీసులు అందిన వెంటనే.. కాలేజీ యాజమాన్యం విద్యార్థి సర్టిఫికెట్లను తిరిగిచ్చేసి, కేసును కొట్టేయాలని కోరింది. యాజమాన్యం వైఖరి వల్ల విద్యార్థి తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడని పేర్కొన్న కమిషన్, 45 రోజుల్లో రూ.1.10 లక్షలను చెల్లించాలని.. లేనిపక్షంలో 9% వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

## నీరు..ఆహారంలో పెస్టిసైడ్స్ అవశేషాలు గుర్తించే పరికరం

**బిట్స్ హైదరాబాద్ బృందం రూపకల్పన**

**సెల్‌ఫోన్‌తో అనుసంధానమయ్యే 'పెస్టిసేఫ్' పరికరం**




**హైదరాబాద్ పెన్ పవర్:**నీరు, ఆహార పదార్థాల్లోని క్రిమిసంహారక మందుల అవశేషాలను గుర్తించే ప్రత్యేక పరికరాన్ని బిట్స్ హైదరాబాద్ ఆచార్యులు, పరిశోధక విద్యార్థుల బృందం రూపొందించింది. బిట్స్ హైదరాబాద్‌లోని ఎంఎంఈఎస్ ప్రయోగశాలలో రూ.ఏడు వేల ఖర్చుతో ఈ పరికరాన్ని తయారుచేశారు. దీనికి 'పెస్టిసేఫ్' అని పేరుపెట్టారు. బ్యాటరీతో పనిచేసే ఈ పరికరంలో రెండు అద్దాలు, సెన్సర్లను ఏర్పాటు చేశారు. వీటిని బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానించారు. రెండు అద్దాలపై నీటి చుక్కలు, ఆహార పదార్థాలను ఉంచితే చాలు..సెన్సర్లు పనిచేసి బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు సమాచారం పంపిస్తాయి. అందులోని రసాయనాలను స్మార్ట్‌ఫోన్‌లో పరీక్షల యాప్ విశ్లేషించి క్షణాల్లో ఫలితాలను అందిస్తుంది. వరిబియ్యం, కీరదోస, నల్లా నీళ్ల నమూనాలను పెస్టిసేఫ్ ద్వారా పరీక్షిస్తే ఫలితాలు సంతృప్తికరంగా వచ్చాయి. ఈ ఫలితాలను ప్రతిష్ఠాత్మక 'మైక్రోకెమికల్ జర్నల్'కు పంపించగా ఇటీవల ప్రచురితమయ్యాయి. ఈ పరికరాన్ని వ్యవసాయ క్షేత్రాలు, ఫుడ్‌మార్కెట్లకు నేరుగా తీసుకువెళ్లేలా అభివృద్ధి చేయనున్నట్లు ప్రొఫెసర్ సతీశ్ కుమార్ దూబే సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ సంకేత్ గోయల్, పరిశోధక బృందం సభ్యులు కె.ఎస్.దీపక్, పి.రమ్యప్రియ, అనికేత్, ఆర్షద్‌లు పెస్టిసేఫ్ పరికరం రూపకల్పనలో పాలుపంచుకున్నారు.

# బిడ్డలను చూసింది.. బడి మురిసింది

**హైదరాబాద్ పెన్ పవర్:**సుమారు 50 రోజుల తర్వాత ప్రారంభమైన పాఠశాలలు సోమవారం కళకళలాడాయి. ప్రత్యేకించి చెత్త, దుమ్ముతో నిండిపోయిన ప్రభుత్వ బడులను ఉపాధ్యాయులు శుభ్రంచేయించి ముస్తాబుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అల్పాహారం, ఎడ్యుకేషన్ కిట్‌లు వంటివి అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు ఉత్సాహంగా చదువుల గుడికి తరలివచ్చారు. ఇన్నాళ్లు పిల్లల నవ్వులు, కేరింతలు వినపడక దిగులు పడిన చదువుల తల్లి ఆనందంతో మురిసిపోయింది. ఉపాధ్యాయులు కూడా పిల్లల్లో ఉత్సాహం నింపేందుకు వినూత్న పద్ధతుల్లో వారికి స్వాగతం పలికారు.

గేటు వద్ద విద్యార్థులపై పూలు చల్లుతూ, చాక్లెట్లు పంచుతూ స్వాగతం పలుకుతున్న ఆదిలాబాద్ పట్టణ ప్రభుత్వోన్నత పాఠశాల ఉపాధ్యాయులు

హనుమకొండ పట్టణంలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం 154 మంది పదో తరగతి పరీక్ష రాయగా 151 మంది ఉత్తీర్ణులయ్యారు. ఓ విద్యార్థి 579 మార్కులతో జిల్లాలో టాపర్‌గా నిలిచారు. దీనికితోడు ఈ విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం, పాలు అందిస్తుండటంతో ప్రవేశాల కోసం తల్లిదండ్రులు బారులుదీరారు.

విద్యార్థులులేని కారణంగా ఎనిమిదేళ్ల కిందట మూతపడిన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని గోవిందుపల్లె ప్రాథమిక పాఠశాల ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైంది. గ్రామస్థుల సహకారం, ప్రజాప్రతినిధుల చొరవతో 20 మందికిపైగా విద్యార్థులు చేరారు.

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట సర్పంచి చిలివేరి జ్యోతి లక్ష్మణ్ దంపతులు తమ కుమారుడిని గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నర్సరీలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు.మహబూబ్‌నగర్‌లోని మహాత్మాగాంధీ రోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 328. అమావాస్య కారణంగా ప్రార్థన సమయానికి 25 మందే హాజరయ్యారు..

# హైదరాబాద్ శివారులో భారీ డ్రగ్ ఫ్యాక్టరీ గుట్టురట్టు... ఆరు నెలల నిఘా, పక్కా స్కెచ్ తో ఈగల్ ఫోర్స్ ఆపరేషన్..

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ శివారులో భారీ డ్రగ్ ఫ్యాక్టరీ గుట్టు రట్టయ్యింది. ఆరు నెలల నిఘా, చేజింగ్ అనంతరం ఈగల్ ఫోర్స్ ఆపరేషన్ సక్సెస్ అయినట్లు తెలిపారు పోలీసులు. ఈ ఆపరేషన్ ద్వారా సంవత్సరాలుగా పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న డ్రగ్ కింగ్ పిన్ ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు పోలీసులు. సోమవారం ( జూన్ 15 ) హైదరాబాద్ శివారులో ఉన్న అబ్దుల్లాపూర్ మెట్ లోని డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించారు పోలీసులు.

ఈ దాడుల్లో ప్రధాన నిందితులు కీసరి మత్స్యగిరి, నిమ్మల నరేష్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. డ్రగ్ ఫ్యాక్టరీ నుంచి రూ.50 లక్షలు విలువైన మెఫెడ్రోన్ స్వాధీనం చేసుకున్నామని.. మరో రూ.50 లక్షల విలువైన ఫ్యాక్టరీ పరికరాలు, రసాయనాలు సీజ్ చేశామని తెలిపారు పోలీసులు. నిందితులు రసాయన శాస్త్రవేత్తగా మొదలై ఇంటర్నేషనల్ డ్రగ్ రాకెట్ సభ్యులుగా ఎదిగారని తెలిపారు పోలీసులు. హత్యలు, దోపిడీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల నుంచి డ్రగ్స్ తయారీ వైపు మళ్లారని..హైదరాబాద్‌లో తయారైన డ్రగ్స్‌ను అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు.

నిందితులకు అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌తో కీలక సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు

తెలిపారు పోలీసులు. సంతోష్ సింగ్ అలియాస్ రాజు, అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ ముఠాలో కీలక సభ్యులుగా గుర్తించామని తెలిపారు పోలీసులు.







02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇందిరమ్మ ఇళ్లకు 77 లక్షల దరఖాస్తులు

## స్థలం లేనివారికీ మంజూరు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రేవంత్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటివరకు ఇళ్లకోసం దాదాపు 77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడత ఎల్1లో సొంత స్థలం ఉండి ఇళ్లు లేని 23 లక్షల మందిని ప్రభుత్వం ఎంపిక చేసి రూ.6,500 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం రెండో విడత మంజూరు చేయనుంది. ఇక స్థలం లేనివారికి ప్రభుత్వ స్థలాల్లో కట్టించాలని భావిస్తోంది. కాగా తొలి విడతలో పూర్తయిన ఇళ్లు ఆమోదయోగ్యంగా ఉండటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు ఆసక్తి పెరిగింది.

## రెండేళ్లలో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ రంగాల్లో అపూర్వ ప్రగతి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ రంగాలను అత్యున్నత ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి గత రెండు సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమం అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని, ప్రతి మహిళకు భద్రత, ప్రతి చిన్నారికి పోషకాహారం, ప్రతి గిరిజన కుటుంబానికి అభివృద్ధి అవకాశాలు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి బలహీన వర్గానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు.

**సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం...**

గత రెండు సంవత్సరాల కాలంలో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలు లక్షలాది మంది జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరేలా, మహిళలు భయరహితంగా జీవించేలా, పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా, గిరిజనులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమాన్ని సాధికారతగా, అభివృద్ధిని సామాజిక న్యాయంగా, ప్రభుత్వాన్ని ప్రజల జీవితాల్లో విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడమే మా లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు.

**మహిళా, శిశు సంక్షేమ రంగంలో సమగ్ర సంస్కరణలు...**

రాష్ట్రవ్యాప్తంగా 56,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు 20 లక్షల మంది లబ్ధిదారులు ఈ సేవలను పొందుతున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా పోషకాహార సరఫరా కొనసాగించడంతో పాటు అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టామని చెప్పారు. అంగన్‌వాడీ సేవలను గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అందించేందుకు 5,389 మంది అంగన్‌వాడీ టీచర్ల నియామకం, 5,287 మంది ఆయాల నియామకం ద్వారా మొత్తం 11 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ...**

అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార పంపిణీ కేంద్రాలుగానే కాకుండా, చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో 10,000 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలు, ఆర్.ఓ. ప్లాంట్లు, భవన మరమ్మతులు, పారిశుద్ధ్య సదుపాయాలు, వంట సామగ్రి, పచ్చదనం పెంపు కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ చేపట్టామని, దీనివల్ల ఇంధన పొదుపు, పరిశుభ్రత, సమర్థవంతమైన వంట ప్రక్రియ సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

**సాంకేతికతతో అంగన్‌వాడీ సేవలకు నూతన రూపం...**

డిజిటల్ పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకెళ్లే క్రమంలో రూ.72 కోట్ల వ్యయంతో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు ఆధునిక 5+ స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పోషకాహార పంపిణీ, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారం, హాజరు నమోదు, ప్రభుత్వ పథకాల అమలు రియల్ టైమ్‌లో పర్యవేక్షించబడుతోందని వివరించారు.

**మహిళల భద్రతకు సమగ్ర రక్షణ వ్యవస్థ...**

మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేసి మహిళలకు అత్యవసర సహాయం, న్యాయ సలహాలు, వైద్య సేవలు, మానసిక స్థైర్యం కల్పించడంతో పాటు పోలీసు సహకారం ఒకే వేదికపై అందిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో వేలాది మంది మహిళలు ఈ సేవల ద్వారా లబ్ధి పొందారని పేర్కొన్నారు.

## కలెక్టరేట్‌లో సేద తీరుతున్న శునకాలు..

## పట్టించుకోని అధికారులు

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:** జిల్లా కలెక్టరేట్ శునకాలకు ఆవాసంగా మారింది. ప్రతి రోజు ఏదో ఒక చోట కుక్కల దాడులతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు గాయాలపాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కుక్కల దాడులను నియంత్రించాలని, వాటిని కట్టడి చేయాలని ప్రజలు అధికారులకు విన్నపాలు చేస్తూనే ఉన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు. తాజాగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే కార్యక్రమానికి తమ సమస్యలు పరిష్కరించమని వినతి పత్రాలు ఇవ్వడానికి వచ్చారు. కలెక్టరేట్‌లో గ్రామ సింహాలు హాయిగా కునుకు తీస్తున్న తీరును చూసీ ఫిర్యాదుదారులు ఔరా అనుకుంటూ భయపడుతూ పక్కకు వెళ్తున్నారు. కుక్కల దాడులను నియంత్రించమంటే ఏకంగా గ్రామ సింహాలు కలెక్టర్ కార్యాలయంలో సేదతీరడం పై ఫిర్యాదుదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## నన్ను నా కొడుకు నుంచి రక్షించండి'..

**ప్రజావాణిలో వృద్ధురాలి కన్నీటి వినతి**

**కొత్తగూడెం పెన్ పవర్:** నా కొడుకు, కోడలు నుంచి తనను కాపాడి, నా ఆస్తి , నా పొలం నాకు ఇప్పించాలని పాల్వంచ మండలం కరకవాగుకు చెందిన 85 సంవత్సరాల వృద్ధురాలు భట్టు కోమి కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేసింది. సోమవారం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసింది. భట్టు కోమికి ముగ్గురు కొడుకులు ఉండగా పెద్ద కొడుకు భట్టు రామ్ దన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. మరో కుమారుడు భట్టు రవి దివ్యాంగుడు కాగా, మరొక తనయుడు భట్టు శ్రీనివాస్ మతిస్థిమితం కోల్పోయి బ్రతుకుతున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న పెద్ద కొడుకు నన్ను మంచిగా చూసుకుంటానని నమ్మబలికి నా తదనంతరం కర్మకాండలు చేస్తానని చెప్పి వారి ఇంటికి తీసుకువెళ్ళి ఇంటి స్థలం, నాలుగున్నర ఎకరాల పొలం కాగితాల పై నా సంతకం తీసుకొని ఇప్పుడు అన్నం పెట్టకుండా వేధింపులకు గురి చేస్తూ, దుర్భాషలాడుతున్నాడని, తనను కొడుతున్నాడని కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. తనకు వస్తున్న పెన్షన్ కూడా లాగేసుకుంటున్నారని కన్నీటి పర్యంతమైంది. తన భూమి, తన పెన్షన్ డబ్బులు ఇప్పించి కొడుకు, కోడలు బారి నుండి రక్షించాలని కోరింది. వెంటనే స్పందించిన కలెక్టర్ ఈ అంశం పై వెంటనే విచారణ చేయాలని ఆర్డీవోకు లేఖ రాశారు.

## కరీంనగర్‌లో జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం ఘనంగా నిర్వహణ

**కరీంనగర్ పెన్ పవర్:** జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ , వాసుదేవ్ హాస్పిటల్ మరియు అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137–ూ సంయుక్త ఆధ్వర్యంలో రేకుర్తి, కరీంనగర్‌లో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన కోసం వాక్‌థాన్, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్ల నాటడం, సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ జనరల్ సర్జన్లకు సన్మానం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఖూూూ అధ్యక్షులు డా. ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను నాటడం ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు. జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చెట్ల నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే, రోగుల ఆరోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న శస్త్రచికిత్స నిపుణుల సేవలను గౌరవించడం, శస్త్రచికిత్స రంగంలో నాణ్యత, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, రోగి భద్రత మరియు వైద్యుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ వారోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.రేకుర్తిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. ఎలగందుల శ్రీనివాస్, డా. వి. మంగీలాల్, డా. సాయి ప్రసాద్, డా. అరుణ్ కటారి, డా. వై. నరేంద్ర, డా. ప్రదీప్, డా. మహేందర్, డా. హరికృష్ణ, డా. శైలేంద్ర, డా. అనిల్, డా. సుధీర్, డా. రాజు,

డా. జితేందర్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ కంజర్ల మహేష్, ఈద కుమారస్వామి, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ శర్మ, గాలిపల్లి నాగేశ్వర్, సాగర్ రెడ్డి మరియు వాసుదేవ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, "ఆరోగ్యం -- సేవ -- పర్యావరణ పరిరక్షణ" అనే లక్ష్యంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## విద్యార్థులకు శుభాకాంక్షలు: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** వేసవి సెలవుల అనంతరం మళ్లీ బడి బాట పట్టిన విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి గారు విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

సీఎం మాట్లాడుతూ "పాఠశాల అనేది కేవలం చదువులు నేర్చుకునే స్థలం మాత్రమే కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఆలయం. ప్రతి పుస్తకం ఒక కొత్త ప్రపంచానికి తలుపు లాంటిది. ప్రతి పాఠం ఒక కొత్త అవకాశానికి మార్గం. విద్య మన భవిష్యత్తుకు వెలుగు నింపే శక్తి. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని విశ్వసిస్తాను. అందుకే అత్యున్నత ప్రమాణాలతో విద్యారంగం విలసిల్లాలని అనేక సంస్కరణలు చేపట్టాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పోషకాలతో కూడిన ఆహారం అందించడమే కాకుండా అనేక చర్యలు చేపట్టామని అన్నారు.

ప్రతి రోజును ఉత్సాహంతో ప్రారంభించి, గురువుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించండి. కష్టపడి చదవండి. మంచి విలువలను అలవర్చుకోండి. మీ కలలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి. నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలు. మీలోని ప్రతిభను వెలికితీసి, కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలి. "విద్యే గొప్ప సంపద -- దానిని ఎవరూ దోచుకోలేరు. విద్యతోనే విజయం, విద్యతోనే వికాసం." ఈ విద్యా సంవత్సరం మీ అందరికీ జ్ఞానం, ఆనందం, విజయాలను అందించాలని ఆకాంక్షిస్తూ... అందరికీ శుభారంభం -- ఆనందంగా బడికి వెళ్లండి, ఆసక్తిగా నేర్చుకోండి, ఉన్నత లక్ష్యాలను సాధించండి" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

## మెట్రోకు కేంద్రం నిధులు ఇవ్వడంలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** జంటనగరాల ప్రజలకు, క్యూర్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. అంతర్జాతీయ నగరానికి అంతర్జాతీయ ప్రమాణాలతో రవాణా సౌకర్యాలు ఉండాలని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వైఎస్ హయాంలో ఆనాటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి జైపాల్ రెడ్డి గారు హైదరాబాద్ కు మెట్రో ప్రాజెక్టు తీసుకొచ్చారు . వైఎస్ మరణానంతరం రోశయ్య హయాంలో మొదటిదశ మెట్రో కోసం ఒప్పందాలు జరిగాయి.2017 నాటికి మెట్రో మొదటి దశ పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రాజెక్టు మొదలైంది. తెలంగాణ వచ్చాక చారిత్రక కట్టడాల సాకుతో మెట్రో మొదటి దశను అడ్డుకున్నారు. కెసీఆర్ చర్యలతో మెట్రో మొదటి దశ మూడేళ్లు ఆలస్యమైందని అన్నారు.15 వేల కోట్లతో పూర్తింకావాల్సిన ప్రాజెక్టు 22 వేల కోట్లకు చేరింది. ప్రాజెక్టు ఆలస్యం, కోవిడ్ ప్రభావంతో ఈ ఎల్ అండ్ టీ నష్టాల్లో కూరుకుపోయింది. పదేళ్లు మెట్రో విస్తరణపై గత ప్రభుత్వం ప్రయత్నించలేదు. వాళ్ల ఆస్తులు పెంచుకునేందుకు తప్ప ప్రజల కోసం ఆలోచించలేదు. హైదరాబాద్ మెట్రో 9 వ స్థానానికి పడిపోయిందని అన్నారు.అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెట్రో విస్తరణ జరగాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వాన్ని ఫేజ్ 2 కోసం ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తిచేశాం. ఫేజ్ 1 నిర్మించిన ఎల్ అండ్ టీ తోనే ఫేజ్ 2 నిర్మించాల్సి ఉంటుందని కేంద్రం నిబంధన పెట్టింది. ఈ ప్రతిపాదనకు ఎఎల్ అండ్ టీ అంగీకరించలేదు. గత నష్టాలతోనే సతమతమవుతున్న తమకు ఫేజ్ 2 నిర్మించడం కష్టమని తేల్చి చెప్పింది. 30 వేల కోట్ల ఆస్తి సృష్టించినా ఏటా 400 కోట్లు నష్టం వస్తుందని చెప్పిందని అన్నారు.అందుకే ఫేజ్ 2 నిర్మాణంలో భాగస్వామ్యం కామని స్పష్టంగా చెప్పింది. భవిష్యత్ నిర్వహణకు కూడా ఒప్పుకోమని తిరస్కరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి అడిగాం. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ఒక్కటే ఏకైక పరిష్కారం అని కేంద్రం చెప్పింది. 30 వేల కోట్ల ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తిని 15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. 13,600 కోట్లు 8.25 శాతం వడ్డీకి బ్యాంకుల్లో ఎల్ అండ్ టీ మెట్రోపై రుణం తెచ్చుకుంది. ఆ లోన్ రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. ఐఆర్ఎఫ్సీ ద్వారా తక్కువ వడ్డీకి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకోవడానికి . 13,600 కోట్లు 4 శాతం వడ్డీకి జపాన్ సంస్థతో అప్పు తీసుకొచ్చాం. ఇది ఐఆర్ఎఫ్సీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉంది. 1400 కోట్లు మేం కట్టాల్సింది కట్టాం. లోన్ వచ్చినట్లే అని అనుకుంటే కిషన్ రెడ్డి అడ్డుకున్నారు . మే 20 న ఖట్టర్ ను, 21 న అశ్వినీ వైష్ణవ్ ను కలిసి ఇవ్వొద్దని చెప్పారు. అందుకే మేం కిషన్ రెడ్డి వెనక పడుతున్నాం. ఇవాళ నిధులు విడుదల కావాల్సి ఉంది.. ఆ బాధ్యత కిషన్ రెడ్డిదే. మీకు కష్టమనుకుంటే మీ 50 శాతం భాగస్వామ్యం అవసరం లేదు . మీరు ఎన్వోసీ ఇవ్వండి... మేమే పూర్తిగా భరించి మెట్రో విస్తరణ చేసుకుంటామని అన్నారు.

మీరు సికింద్రాబాద్ ఎంపీగా ఉన్నారు.. నలుగురు మీ ఎంపీలు ఉన్న ప్రాంతంలోనే మెట్రో విస్తరణ జరగాల్సి ఉంది. ఎందుకు కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోరు? వరంగల్ ఎయిర్ పోర్టు స్పీడ్ అయ్యాక వెళ్లి రామ్మోహన్ నాయుడిని కలిశాడు.. ఆ పనులు స్లో అయ్యాయి. జపాన్ సంస్థ ఇప్పటికే నిధులను ఐఆర్ఎఫ్సిజ కి విడుదల చేసింది.. కానీ IRFC రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయడంలేదు. ఆ డబ్బులకు వడ్డీ ఎవరు కట్టాలి. కిషన్ రెడ్డి చెప్పాలి రిజర్వు బ్యాంకును ఒప్పించిన లెటర్ కూడా తీసుకెళ్లి ఇచ్చాం.. అయినా లోన్ ట్రాన్స్ఫర్ కాకుండా అడ్డుకున్నారు దీనిపై కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుంటారా లేదా అని ప్రశ్నించారు.లేకపోతే ఎన్వోసీ ఇచ్చి మీ భాగస్వామ్యం వదులుకుంటారా? అలా చేస్తే మేమే మెట్రో ఫేజ్ 2 కట్టుకుంటాం.

# బంజారాహిల్స్ టూ పీవీఎక్స్ ప్రెస్ హైవే

**హైదరాబాద్ జూన్ 15, పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా కీలక కారిడార్లను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ సరికొత్త మౌలిక వసతుల ప్రాజెక్టును తలపెట్టింది. ప్రధాన నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ప్రయాణం సాఫీగా సాగేలా సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1లోని జీవీకే వన్ మాల్
వద్ద ప్రారంభమై.. మాసబ్‌ట్యాంక్ మీదుగా ప్రస్తుతం ఉన్న పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుసంధానం చేసేలా సుమారు 4 కిలోమీటర్ల పొడవైన పైవంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పనులను ప్రారంభించింది. రానున్న రెండేళ్ల కాలంలోనే ఈ కారిడార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.ప్రస్తుతం నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా చేరుకోవడానికి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులో ఉన్నప్పటికీ ప్రధాన నగరం నుంచి ఆ ఎక్స్‌ప్రెస్‌వేను చేరుకోవడమే ప్రయాణికులకు పెద్ద నరకంగా మారింది. ముఖ్యంగా రద్దీ వేళల్లో బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1, జీవీకే మాల్, తాజ్‌కృష్ణ, కేర్ ఆసుపత్రి, మాసబ్‌ట్యాంకు జంక్షన్లను దాటడానికి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు ఈ కొద్దిపాటి దూరం దాటడానికే గంటల కొద్దీ సమయం పడుతుండటంతో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ వైపు ఇరువైపులా ట్రాఫిక్ సమస్యకు పెద్ద ఊరట లభించనుంది. బేగంపేట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనదారులు పంజాగుట్ట ఫ్లైఓవర్ ద్వారా నేరుగా ఈ కొత్త జీవీకే ఫ్లైఓవర్ ఎక్కి ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా ఆరాంఘర్ జంక్షన్‌కు, అక్కడి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం వ్యూహాత్మక ర్యాంపులను డిజైన్ చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ప్రాంతంలో ఒక డౌన్ ర్యాంపును నిర్మించనున్నారు. ఇది ఎయిర్‌పోర్టు వైపు నుంచి వచ్చే వాహనాలు రోడ్డు నంబరు 10, 12 వైపు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి చింతల్‌బస్తీ మీదుగా రోడ్డునంబర్ 12 వైపు వెళ్లే వాహనాల కోసం చింతల్‌బస్తీ జంక్షన్ వద్ద ప్రధాన ఫ్లైఓవర్ కింద నుంచి మరో చిన్న పైవంతెన నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. ఇక లక్డీకపూల్, మాసబ్‌ట్యాంక్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలు కొత్తగా నిర్మించే ఫ్లైఓవర్ పైకి సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఎన్ఎండీసీ భవనం ముందు ఒక అప్ ర్యాంపును
ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక త్వరలోనే సిద్ధం కానుందని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. డీపీఆర్ రూపకల్పన పూర్తయిన తర్వాత ప్రాజెక్టుకు
అయ్యే మొత్తం వ్యయం, భూసేకరణ అవసరాలు, ఇతర సాంకేతిక అంశాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పైవంతెన నిర్మాణానికి కృతనిశ్చయంతో ఉందని, నిధుల కొరత లేకుండా వేగంగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో పాటు పశ్చిమ హైదరాబాద్ ప్రజలకు సైతం ఎంతో వెసులుబాటు లభిస్తుంది.

# 28పాలసీలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సోమవారం మందమర్రిలో పర్యటించారు. బొగ్గుబాయి" కార్యక్రమంలో భాగంగా కాసిపేట మైన్ 1 పరిశీలించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాలసీలు చేయాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లే వినతి పత్రాలిస్తూ సింగరేణి కార్మికులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్నింటిలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. కార్మికులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
కవిత మాట్లాడుతూ తెలంగాణ లో కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం. సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కోసం ఇక్కడకు వచ్చాను. తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేశాం, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ కలిసి పనిచేశాం. నేను ఎక్కడ ఉన్న కూడా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాటం చేశాను. సింగరేణిలోని మెడికల్ బోర్డు పెట్టకపోతే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించాం. ఈ ప్రభుత్వంలో సర్వసామాన్యంగా జరగాల్సిన పనులకు కూడా పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు.
హైదరాబాద్, ఢిల్లీలో ఉండి మనకు బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లు మీకే వినతి పత్రాలు ఇస్తున్నారు. మనకు ఐటీ సమస్య లేకుండా, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాల్సిన పనులు ఈ ప్రభుత్వం చేయటం లేదు. చేయాల్సిన పనులు చేయకుండా ఇక్కడకు వచ్చి కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ కార్మికులతో నిరంతరం ఉండి ఎవరు పోరాటం చేస్తారో మీ అందరికీ తెలుసు. మనకు ముఖ్యంగా హక్కుగా రావాల్సిన డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేయాల్సి ఉంది. సింగరేణికి బొగ్గు బావులు తెచ్చుకుంటే దాదాపు లక్ష ఉద్యోగాలు ఇవ్వవచ్చు. కానీ అన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని, అండర్ గ్రౌండ్ మైనింగ్ ను రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారు. టీఆర్ఎస్ కార్మికుల కోసం హెచ్ఎంఎస్ తో కలిసి పోరాటం చేస్తుంది. రానున్న ఏ ఎన్నికల్లోనైనా, పోరాటాల్లోనైనా హెచ్ఎంఎస్ తో కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా



పోరాడుతుందని అన్నారు.
హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా పోరాటం చేస్తున్న సంగతి మీకు తెలిసిందే. మనకు ఢిల్లీ స్థాయిలో పనులు కావాలంటే జేబీసీసీ లో మనం పోరాడాలి. రియాజ్ అందులో సభ్యులుగా ఉండి సింగరేణి కార్మికుల కోసం పోరాటం చేస్తున్నారు. పాలసీలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి బకాయి ఉన్న రూ. 50 వేల కోట్లను వెంటనే చెల్లించాలి. వారం రోజుల పాటు బాయి బాట కార్యక్రమం ఉంటుంది. కాసిపేట నుంచే బాయి బాట కార్యక్రమం మొదలుపెట్టాం. ఓపెన్ కాస్ట్ మైనింగ్ పెంచే ప్రయత్నం చేస్తున్న సింగరేణి కార్మికుల భద్రతను పట్టించుకోవటం లేదని అన్నారు.
ఇప్పుడున్న కార్మికుల్లో చాలా మంది యువ వయసు వాళ్లు ఉన్నారు. వారి పిల్లలు చదువుకునేందుకు సరైన స్కూల్స్, సరైన హాస్పిటల్స్ లేవు. అన్నింటిల్లో ప్రైవేట్ ను తీసుకొచ్చి వైద్యాన్ని మరింత ఖరీదు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చింది. కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా మేము అందజేస్తాం. ఈ ప్రభుత్వం ఇవ్వగలిగే స్థాయిలో ఉండి ఇవ్వటం లేదు. టీఆర్ఎస్ పెట్టిన తర్వాత సింగరేణిలో నా మొదటి యాత్ర ఇది. మా పార్టీకి సింగరేణి కార్మికుల దీవెనార్తి ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

## సోదరి కలిపించడంలేదు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ పిర్యాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి తన సోదరి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో నివసించే తన సోదరి కె.నమ్రత(57) ఈ నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదని విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కోన్నారు. సతీష్(35), సత్యనారాయణ(45), కుమారి(45) అనే ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్లో ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గోన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**హైదరాబాద్:** హైదరాబాద్లో తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం మరియు పాలు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.
అల్పాహారం మరియు పాలు పంపిణీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు, పాఠశాలలకు హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

## అనురాగ్ యూనివర్సిటీలో ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ కోర్సు ప్రారంభం..

**కేపీఎంజీ ఇండియాతో భాగస్వామ్యం**

**హైదరాబాద్,:** గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రముఖ విద్యాసంస్థ అనురాగ్ యూనివర్సిటీ.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (BFSI) రంగంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (MBA) కోర్సును ఇవాళ ప్రకటించింది. ఈ కోర్సులో భాగంగా ఎంపిక చేసిన కొన్ని ప్రత్యేక సబ్జెక్టులను బోధించడానికి, అలాగే విద్యార్థులకు ఇండస్ట్రీ నాలెడ్జ్ అందించడానికి ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కేపీఎంజీ (KPMG in India) సాంకేతిక సహాయాన్ని అందించనుంది.ఈ టూ-ఇయర్ ఫుల్-టైమ్ ప్రోగ్రామ్ పూర్తి డిజైన్, నిర్వహణ, విద్యార్థుల అసెస్‌మెంట్ (మూల్యాంకనం) బాధ్యతలను అనురాగ్ యూనివర్సిటీ చూసుకుంటుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో 30 మంది విద్యార్థుల పరిమిత సీట్లతో ప్రారంభం కానున్న ఈ మొదటి బ్యాచ్ క్లాసులు 2026 ఆగస్టు నుండి మొదలవుతాయి. ఈ కోర్సు కోసం అప్లికేషన్ల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. 2026 జులై మొదటి వారంలో దరఖాస్తుల గడువు ముగుస్తుంది.
తరగతి గది అభ్యాసానికి, ఈ రంగంలోని వాస్తవ పనితీరుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ (MBA-BFSI) కోర్సును రూపొందించారు. ఈ రంగం వాస్తవంగా ఎలా పనిచేస్తుందనే అంశాలను ప్రతిబింబించేలా కేపీఎంజీ ఇండియా ఈ పాఠ్యప్రణాళికను పాక్షికంగా సిద్ధం చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ అనాలిసిస్, రిస్క్ అండ్ కాంప్లయన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వంటి విభాగాలలో ఇండస్ట్రీ కేస్ స్టడీస్, అప్లైడ్ లెర్నింగ్ మోడ్యూల్స్ మరియు క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. అయితే విద్యార్థుల అసెస్‌మెంట్ మరియు గ్రేడింగ్ ప్రక్రియను మాత్రం పూర్తిగా అనురాగ్ యూనివర్సిటీ మాత్రమే నిర్వహిస్తుంది. ఈ మీడియా సమావేశంలో అనురాగ్ యూనివర్సిటీ స్ట్రాటజీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, అనురాగ్ పల్లా మరియు కేపీఎంజీ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ పార్ట్నర్ అండ్ నేషనల్ హెడ్, నారాయణన్ రామస్వామి మాట్లాడారు.

## జర్మన్ భాషా ప్రావీణ్యంతో అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి:

### మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ పెన్ పవర్:**





జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గమని రాష్ట్ర మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా యువత అంతర్జాతీయ స్థాయిలో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన అన్నారు.
హైదరాబాద్లోని టామ్కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత కోసం టామ్కామ్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో జర్మనీలో మంచి వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కొత్త భాషను నేర్చుకుని జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉద్యోగాలు సాధించడం యువతకు గొప్ప అవకాశమని అన్నారు.
ఇటీవల మందమర్రిలో ప్రారంభించిన జర్మన్ భాషా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభించిందని తెలిపారు. మందమర్రి కేంద్రంలో ఇప్పటికే సుమారు 200 మంది యువత జర్మన్ భాషా కోర్సులో చేరినట్లు వెల్లడించారు.
విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ శిక్షణ నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. విదేశీ ఉద్యోగాలను పొందడంలో భాషా ప్రావీణ్యమే ప్రధాన అడ్డంకిగా మారుతోందని, దానిని అధిగమించేందుకు విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు.
విద్యార్థులు ఒక్క తరగతిని కూడా మిస్ కాకుండా క్రమం తప్పకుండా హాజరై భాషపై పూర్తి పట్టు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో శిక్షణ పొందితే ఉన్నత స్థాయి భాషా నైపుణ్యాలను సులభంగా సాధించగలరని పేర్కొన్నారు.
ఏ భాషనైనా నేర్చుకోవాలంటే నిరంతర అభ్యాసమే విజయానికి మూలమని మంత్రి స్పష్టం చేశారు. ఇటువంటి భాషా శిక్షణ కార్యక్రమాలు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన కెరీర్ నిర్మాణానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హై స్కూల్ గేట్కు తోరణాలు కడుతుండగా కరెంట్ షాక్.. విద్యార్థికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పాఠశాలలు తెరుచుకోవడంతో హై స్కూల్ గేట్కు తోరణాలు కడుతుండగా విద్యార్థికి కరెంట్ షాక్ తగిలింది. ఘటనలో విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఘటన జరిగింది. స్కూల్ పక్కన ఇల్లు ఉండటంతో ఆడుకోవడానికి వెళ్లిన రామ్ చరణ్(13) అనే విద్యార్థితో ఉపాధ్యాయులు తోరణాలు కట్టించారు. తోరణాలు కడుతుండగా రామ్ చరణ్కు కరెంట్ షాక్ తగిలింది. వెంటనే దేవరకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి ఉపాధ్యాయులు తరలించారు. బాధితుడు రామ్ చరణ్ కొండమల్లెపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

## విద్యార్దులకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ ఢ మిల్క్ పథకాన్ని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు ఢ నోట్ బుక్స్ పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్ , యశస్వినీ రెడ్డి , కలెక్టర్ ప్రియాంక ఆలా ,డీఈవో యాదయ్య , మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే 29 లక్షల మంది విద్యార్థిని విద్యార్థులకు అల్పాహారం ఢ పాలు పథకాన్ని ప్రారంభిస్తుంది.. విద్యార్థులకు దీని ద్వారా పౌష్టిక ఆహారం అందిస్తుంది. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా బడి బాట కార్యక్రమం ద్వారా డ్రాప్ ఔట్ విద్యార్థులను బడి లోకి తీసుకురావడం ఇతర పాఠశాలల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని అన్నారు.
స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వం దాదాపు 800 కోట్లు ఖర్చు చేస్తుంది.. పిల్లలందరూ మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. ఈరోజు నుండి ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభిస్తున్నాం.. వారు స్కూల్ లోనే తినేలా బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేస్తున్నాం. ఉదయం లేవగానే రెడీ అయి స్కూల్ కి రావాలే ఇక్కడే బ్రేక్ ఫాస్ట్ లంచ్ చేయాలి. మీ తల్లిదండ్రులు కష్టపడుతున్న దాని కంటే రెట్టింపు చదువుకొని కష్టపడి మంచి పేరు తీసుకురావాలి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు ,ప్రభుత్వ హాస్పిటల్ లు వద్దు ,ప్రభుత్వ ఉద్యోగం కావాలని విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్నాం.. అందరూ కష్టపడి చదువుకోవాలి. ఈ అల్పాహారం పథకం ప్రీ-ప్రైమరీ (గ్రా) నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుంది. అల్పాహారం పథకం ద్వారా విద్యార్థుల్లో ఆకలిని నివారించడం ,పోషకాహార లోపాన్ని తగ్గించడం , ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడటం,పాఠశాల హాజరును పెంచడం,డ్రాప్‌అవుట్లను తగ్గించడం ,విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ప్రతిభను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

## వ్యాపారి కిడ్నాప్.. కోటి రూపాయల బంగారం దోపిడి

**హైదరాబాద్ పెన్ పవర్:** పలమనేరు రూరల్ మండలం సముద్రపల్లి వద్ద గంగవరం కు చెందిన వ్యాపారి రవిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసారు. గత ఆదివారం సొంత గ్రామం గంగవరంలో జాతరకు రవి హాజరైయాడు. మిత్రులతో సముద్ర పల్లి వద్ద తన సొంత మామిడి తోటలో డిన్నర్ ఏర్పాటు చేసాడు. డిన్నర్ ముగించుకుని తిరిగి వస్తుండగా సినీ పక్కిలో రవిని కిడ్నాప్ చేసారు. . తోట నుండి బయటకు వచ్చిన రవి కారును మరో మూడు కార్లు వెంబడించాయి. మూడు కార్లలో వచ్చిన కిడ్నాపర్స్ కొద్ది దూరంలోనే రవి కారును ఆపి రౌండప్ చేసారు. . కారులో అప్పటికే ముగ్గురు మిత్రులతో కలిసి రవి ప్రయాణిస్తున్నాడు. ఎం సి రవి ఎవరు అంటూ కిడ్నాప్ ముఠా ప్రశ్నించింది. రవి ఎవరో తెలుసుకొని మేము కేరళ పోలీసులు అంటూ హ్యాండ్ కప్స్ వేసి రవి ని తీసుకువెళ్లారు. మిత్ర బృందం అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం నాడు రవి తిరిగి వచ్చాడు. ... నా వద్ద ఉన్న కోటి బంగారం దోచుకుని 20 లక్షల క్యాష్ తీసుకున్నట్టు పోలీసులకు రవి ఫిర్యాదు చేసాడు. పోలీసులకు తన మిత్రుడైన ప్రసాద్ మీద బాధితుడు అనుమానం వ్యక్తం చేసాడు. పోలీసులు .. అందరినీ అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

# నిల్వ దాన్యాలను తరలించలేదు
# అందోళనలో రైతన్నలు

**వికారాబాద్: పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో వరి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం ఇంకా తరలించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి యాలాల మండల కేంద్రంలోని కాగ్నా జలాల ఎఫ్పీఓ వరి కొనుగోలు కేంద్రంతో పాటు బెన్నూర్ వరి కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన వరి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.
పంటను ఎంతో శ్రమించి పండించిన రైతులు ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా కాపాడుకునేందుకు రాత్రంతా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోయి రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త సాగుకు పొలాలను చదును చేసుకునే సమయం ఆసన్నమైందని, అయితే ధాన్యం ఇంకా కేంద్రాల్లోనే ఉండటంతో తదుపరి వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.
“మరికొన్ని రోజులు ఇలాగే కేంద్రాల వద్దే వేచి చూడాలా? ఇంకెప్పుడు ధాన్యాన్ని తరలిస్తారు?” అంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తడిసిన ధాన్యానికి నష్టం కలగకుండా వెంటనే బస్తాలను తరలించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కేంద్రాల్లో నిల్వ ఉన్న బస్తాలను అత్యవసరంగా తరలించాలని రైతులు కోరుతున్నారు.

# ఆరు బస్సులను సీజ్ చేసిన అధికారులు
## స్కూల్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారుల దాడులు

**రంగారెడ్డి: పెన్ పవర్:** సోమవారం నుండి ప్రైవేట్ పాఠశాలలు పున ప్రారంభం కావడంతో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సుల పై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.
ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. బస్సు కు సంబంధించిన ఆర్సి పర్మిట్ ఇన్సూరెన్స్ ఫిట్నెస్ పొల్యూషన్ తో పాటు డ్రైవర్ లైసెన్స్ చెక్ చేస్తున్నారు. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులో సేఫ్టీల విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు. బస్సులో ఉండాల్సిన ఫైర్ పరికరాలు, మెడికల్ కిట్ విద్యార్థుల లిస్ట్ తోపాటు అనుభవం కలిగిన డ్రైవర్ బస్సు నడుపుతున్నాడు అనే విషయాలను పరిశీలిస్తున్నారు. 60 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లు ఉన్నారని కోణంలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు.

# నిధుల్లేక నీరసిస్తున్న పాఠశాల పనులు

**నల్గొండ, జూన్ 15, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన ‘మన ఊరు – మన బడి’ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాం లో చేసిన పనులకు సంబంధించి రూ. 300 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్.. గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు చెల్లించింది. విడుదల చేసిన దాంట్లోనూ రూ. 46 కోట్లు ఓ పెద్ద కంపెనీకే ఇచ్చిందని చిన్న కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పను లు చేపట్టి మూడేళ్లవుతున్నా బిల్లులు రాకపోవడంతో చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9 వేల ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నిర్మాణ పనులు చేపట్టింది. దాదాపు వెయ్యి మంది కాం ట్రాక్టర్లు ఈ పనులు చేశారు. డైనింగ్ హాల్, మ రుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రికల్ వంటి మైనర్ పనులను చిన్న కాంట్రాక్టర్లు అప్పగించగా, పేయంటింగ్, స్మార్ట్ క్లాస్‌లకు సంబంధించి డిజిటల్ బోర్డులు ఏర్పాటు తదితర పెద్ద పనులను ఓ బడా కంపెనీకి ఇచ్చారు. వెయ్యి మంది కాంట్రాక్టర్లలో రూ.10 లక్షల లోపు పనులు చేసిన వారు 600 మంది వరకు ఉంటారు.ఇందులో రూ.5 లక్షల లోపు పనులు చేసిన వాళ్లకు దాదాపు రూ.141 కోట్లు, రూ.5– 10 లక్షల లోపు రావాల్సిన బిల్లులు రూ.75 కోట్లు, రూ.10–30 లక్షల లోపు రూ.75 కోట్లు, రూ.30 లక్షలకు పైగా రావాల్సిన బిల్లులు రూ. 50 కోట్లకుపైగా ఉంటాయి. మొత్తం కలిపి చిన్న కాంట్రాక్టర్లకు రూ.350 కోట్ల వరకు చెల్లించా ల్సి ఉంది. ఇందులో రూ.50 కోట్లు విడుదల చేయగా ఇంకా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉం ది. బడా కంపెనీలకు రూ.650 కోట్లకు దాదాపు క్లియర్ చేసినట్లుగా ఓ కాంట్రాక్టర్ తెలిపారు. అప్పులు చేసి మరీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీ భారం పెరుగుతుందని చిన్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి రూ.100 కోట్లు చెల్లిస్తే మైనర్ పనులు చేసిన వారి సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. రూ.5 లక్షల లోపు బిల్లులకు కూడా మూడేళ్లుగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు దాదాపు 99 శాతం బిల్లులు క్లియర్ చేసిన ప్రభుత్వం.. తమకు రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుందని అంటున్నారు. ప్రభుత్వాన్ని బిల్లులు అడిగితే డబ్బుల్లేవు, ఉన్నప్పుడు ఇస్తామని అంటుంది. ఎప్పుడు అడిగినా ఇదే మాట చెబుతుంది. గత ప్రభుత్వంలో కూడా బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఈ ప్రభుత్వంలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తానని గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు ఇచ్చింది. ఇందులోనూ 90 శాతం వరకు ఓ బడా కంపెనీకే పోయాయి. ఈనెలలో మరో రూ.50 కోట్లు మంజూరు చేశామంటున్నారు. అవి ఇంకా జమ కాలేదు. అధికారులను అడిగితే నేడోరేపో జమ అవుతాయని అంటున్నారు.

# సఫారీలో పెద్ద పులి ప్రత్యక్షం

**నాగర్ కర్నూల్ పెన్ పవర్:** అమ్రాబాద్ జంగల్ సఫారీలో మరోసారి పెద్దపులి ప్రత్యక్షం అయింది. సఫారీలో పర్యాటకులను కనువిందు చేసింది. గుండం సమీప ప్రాంతంలో పర్యాటకులకు పెద్దపులి తారసపడింది. ఆదే సమయానికి మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ రాజేష్ అగర్వాల్ కుటుంబ సభ్యులతో కలిసి జంగల్ సఫారీలో ప్రయాణిస్తుండగా పులి తారసపడింది. పెద్దపులి ఒక్కసారిగా కనిపించడంతో పర్యాటుకులు ఆనందం వ్యక్తం చేశారు. పులి వీడియోలను ఫోన్లో బంధించారు. కాసేపు పర్యాటకులను కనువిందు చేసిన పెద్దపులి తరువాత అడవిలోకి వెళ్లిపోయింది.

# రాజకీయ వత్తిళ్లకు లొంగొద్దు
# అవినీతికి పాల్పడవద్దు

**నూతన ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకు సూచన**

**సికింద్రాబాద్: పెన్ పవర్:** రాజకీయ వత్తిళ్లకు లొంగొద్దని, అవినీతికి పాల్పడవద్దని నూతన ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారు వీ హనుమంతరావు, మాజీ ఐఏఎస్ అధికారి గోపాల కృష్ణ నాయుడు తెలిపారు. ఆల్ ఇండియా తెలగ కాపు బలిజ సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని సప్తగిరి హోటల్ లో కాపు సామాజిక వర్గానికి చెందిన పారిశ్రామిక వేత్తలను, నూతనంగా సివిల్ సర్వీస్ లో ప్రతిభను కనబరిచి ఉద్యోగాలు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, మంచి పనులు చేస్తూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని కాపు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కోమరయ్య, ప్రముఖ ఇంద్ర జాలికుడు సామల వేణు, ఉభయ తెలుగు రాష్ట్రలలోని కాపు ప్రముఖులు పాల్గొన్నారు.

# భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

**హైదరాబాద్: పెన్ పవర్:** ఆరు నెలల పాపతో మహిళ బిల్డింగ్ పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్తను రిమాండ్ కు తరలించారు. మియాపూర్లో మయూరి నగర్ పరిధిలోని ఓ అపార్ట్మెంట్లో నివసిస్తూ, తన ఆరు నెలల పాపతో ఆరవ అంతస్తు నుండి దూకి ఈషా సాహు(37) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. రెండో కూతురు పుట్టిందని భర్త భూపేంద్రసాహు వేధించడమే కారణమని మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి భర్తను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా, పాప గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

# నా కోరిక తీరిస్తేనే సినిమాల్లో ఛాన్స్

**హైదరాబాద్ పెన్ పవర్:**
కొన్నేళ్లుగా సినీ రంగంలో ఉన్న ఓ యువనటి(21)కి ఓ సినిమాలో హీరోయిన్ స్నేహితురాలి పాత్ర ఇప్పిస్తానని ప్రసాద్ అనే క్యాస్టింగ్ ఆర్టిస్ట్ సంప్రదించాడు. 2025 అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు ఈ సినిమా షూటింగ్ పూర్తవగా, నటికి ఇవ్వాల్సిన రూ.90 వేల పారితోషికం, రూ.38 వేల ప్రయాణ చార్జీలు ఇవ్వకుండా ప్రసాద్ తప్పించుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన తనను కలవమని చెప్పి, బలవంతంగా కారులో ఎక్కించుకుని, తన కోరిక తీరిస్తే ఇతర సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని సదరు నటిపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. నిందితుడి నుండి తప్పించుకుని, జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో, ప్రసాద్ను బాధితురాలిద
తల్లి నిలదీసింది. దీంతో ప్రసాద్ బాధితురాలి తల్లిని కూడా దూషించడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
‘పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# దూకుడు ప్రదర్శించని బీఆరెస్

**హైదరాబాద్, జూన్ 15, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి–అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది. ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ.. రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది.బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ–బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత ఆజ్యం పోస్తున్నాయి.




నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్‌లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్‌లైన్, ఆన్‌గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి. అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక ‘బి–టీమ్’ గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే
పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే.. బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.

# కాంగ్రెస్ గూటికి జగన్ !
# చక్రం తిప్పుతున్న రేవంత్

**హైదరాబాద్, జూన్ 15 పెన్ పవర్:**
రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఇప్పుడు ఒకదానికొకటి పెనవేసుకుని, అత్యంత ఆసక్తికరమైన చెస్ గేమ్‌ను తలపిస్తున్నాయి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మెల్లగా గళం విప్పుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. జగన్ ప్రధాని మోదీ లేదా కేంద్ర ప్రభుత్వంపై నేరుగా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, కేవలం విధానపరమైన వ్యతిరేకతను మాత్రమే ప్రదర్శిస్తూ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి దక్కాల్సిన రాజ్యసభ సీటు చివరి క్షణంలో సాంకేతిక, రాజకీయ కారణాల వల్ల చేజారడం గమనార్హం. ఈ పరిణామాలు ఏపీలోనే కాకుండా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పొలిటికల్ వ్యూహాల్లోనూ పెను మార్పులకు కారణమవుతున్నాయి.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే కూటమికి దూరంగా జరుగుతూ, లోపాయకారీగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే సంకేతాలు పంపడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ కూటమిని ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, జాతీయ స్థాయిలో యాంటీ–బీజేపీ శక్తులతో జతకట్టడం మేలనే యోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. శుక్రవారం నాటి మీడియా చిట్‌చాట్‌లో జగన్‌కు అనుకూలంగా సానుభూతి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఏపీలో జగన్ సభలకు, ర్యాలీలకు కూటమి ప్రభుత్వం అనుమతులు నిరాకరిస్తోందంటూ రేవంత్ మాట్లాడటం వెనుక.. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్‌కు దగ్గరైతే తద్వారా వచ్చే పొలిటికల్ మైలేజీని ఒడిసిపట్టాలనే ముందస్తు ప్లాన్ కనిపిస్తోంది.ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుతో నొచ్చుకున్న ఒక వర్గాన్ని శాంతపరిచేందుకే, జగన్ సభల అనుమతులపై రేవంత్ సానుభూతి అస్త్రం విసిరారనే ప్రచారం సాగుతోంది. హైదరాబాద్ గుండెకాయ లాంటి




అమీర్‌పేట్ జంక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దివంగత నేత ఎన్టీ రామారావు 23 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపింది. కాంగ్రెస్‌కు బద్ధశత్రువుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే పెట్టడంపై తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ఒక వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఈ చర్యతో బీఆర్ఎస్, మలిదశ ఉద్యమకారుల నుంచి రేవంత్ విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని వైఎస్సార్ అభిమానులను, రెడ్డి సామాజికవర్గాన్ని సమతూకం చేయడానికి జగన్ ప్రస్తావన తెచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ విగ్రహం ద్వారా ఆంధ్రా సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను కొల్లగొట్టడం.. అలాగే జగన్ సభలపై సానుభూతి చూపడం ద్వారా వైఎస్సార్ ఓటు బ్యాంకును కాపాడుకోవడం
రేవంత్ మార్క్ డబుల్ గేమ్ .ఈ మొత్తం పరిణామాల వెనుక ఉన్న అసలు లక్ష్యం.. త్వరలో రాబోయే హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలే. హైదరాబాద్ పరిధిలో ఆంధ్రా మూలాలున్న ఓటర్లు, సెటిలర్లు గెలుపోటములను శాసిస్తారు. గతంలో ఈ ఓటు బ్యాంక్ అంతా బీఆర్ఎస్ వైపు నిలిచింది. ఇప్పుడు కేసీఆర్ బలహీనపడటంతో ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడమే రేవంత్ రెడ్డి ఏకైక అజెండా. అందుకోసమే అటు ఎన్టీఆర్ అభిమానులను, ఇటు వైఎస్సార్ అనుచరులను ఒకేలా ప్రసన్నం చేసుకునే దిద్దుబాటు చర్యలకు ఆయన శ్రీకారం చుట్టారని అంటున్నఏపీలో షర్మిల రాజ్యసభ సీటు మిస్ అవ్వడం కూడా జగన్–కాంగ్రెస్ సాన్నిహిత్యానికి మార్గం సుగమం చేస్తోందనే వాదన ఉంది. ఒకవేళ షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్‌కు పంపి ఉంటే, జగన్ కాంగ్రెస్ వైపు చూడటం అసాధ్యమయ్యేది.
కానీ ఇప్పుడు మారిన సమీకరణాల్లో జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, కాంగ్రెస్‌తో ఫ్రెండ్‌షిప్‌కు సై అంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. మొత్తానికి ఏపీలో జగన్ వేస్తున్న అడుగులు.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి రాస్తున్న పొలిటికల్ స్క్రిప్ట్‌లు రెండూ ఒకదానికొకటి ముడిపడి సాగుతున్నాయి. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో రేవంత్ రెడ్డి నడుపుతున్న ఈ మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి.

# పాపం షర్మిళ... ఏటీ చేద్దాం



**కడప, జూన్ 15 పెన్ పవర్:**
వైయస్ షర్మిల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆవేదనతో ఉన్నారా? తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? తనకు రాజ్యసభ పదవి ఇవ్వకపోవడంపై కొందరి హస్తం ఉందన్న అనుమానాలు ఆమెలో ఉన్నాయా? అందుకే ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. కొద్ది రోజుల కిందట కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిలను ఎంపిక చేస్తారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆమెను ఢిల్లీ పిలిచి కాంగ్రెస్ అగ్ర నేతలు అభయం కూడా ఇచ్చారట. కానీ ఇంతలోనే సమీకరణలు మారిపోయాయి. చివరి నిమిషంలో షర్మిల పేరు లేకుండా పోయింది. అయితే కాంగ్రెస్ పార్టీ కోసం తాను నిలబడితే.. పార్టీ మాత్రం ఇచ్చిన మాట కట్టుబడి ఉండలేదన్న ఆవేదన షర్మిల లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బాధతోనే రెండు రోజుల కిందట ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరైనట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. కానీ వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు తన పార్టీని. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే ఏపీలో పార్టీ బాధ్యతలు తీసుకుంటే రాజ్యసభకు అవకాశం ఇస్తామని.. అది కూడా కర్ణాటక నుంచి ఛాన్స్ కల్పిస్తామని అప్పట్లో అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ హామీ ఇచ్చారు. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె కృషి చేస్తూ వచ్చారు. కర్ణాటక నుంచి రాజ్యసభ పదవులు ఖాళీ అయ్యాయి. అక్కడినుంచి ఛాన్స్ దక్కుతుందని భావించారు షర్మిల. అందుకు తగ్గట్టుగానే ఢిల్లీ నుంచి సమాచారం రావడంతో వెళ్లి వచ్చారు. నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో కాంగ్రెస్ హై కమాండ్ హ్యాండిచ్చింది. అయితే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారానే.. తనకు రాజ్యసభ పదవి రాకుండా కుట్ర జరిగిందన్నది షర్మిల లో ఉన్న అనుమానం. ప్రధానంగా కర్ణాటక కాంగ్రెస్ నేతలతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన బెంగుళూరులో తన రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు అదే కర్ణాటక కాంగ్రెస్ నేతలతో కలిసి జగన్మోహన్ రెడ్డి తనకు రాజ్యసభ పదవి రాకుండా అడ్డుకున్నారన్న అనుమానం షర్మిల లో ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా ఇటీవల ఆమె ఒక ట్వీట్ చేసినట్లు తెలుస్తోంది. పైగా జగన్మోహన్ రెడ్డిని మచ్చిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న అనుమానాలు కాంగ్రెస్ హై కమాండ్ పై ఉన్నాయి. ఈ అనుమానాలతోనే ఆమె కాంగ్రెస్ హై కమాండ్ పై రగిలిపోతున్నారు. అందుకే కీలకమైన ఇండియా కూటమికి గైర్హాజరయ్యారు. ఇదే పరిణామాలు కొనసాగితే షర్మిల తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# మాజీ ఐపీఎస్ వర్సెస్ మాజీ ఎంపీ... రసకందాయంలో రాజకీయం

**రాజమండ్రి, జూన్ 15 పెన్ పవర్:**
(ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ సమావేశానికి ఒక్క పీవీ సునీల్ కుమార్‌కు మాత్రమే ఎందుకు ఆహ్వానం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అందువల్లే ఆయన్ను ప్రభుత్వం అరెస్ట్ చేయలేక పోతుందేమోనని, ఆయన ఎక్కడ మీటింగ్ పెట్టినా ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలో ఆర్ఎస్ఎస్ సమావేశానికి హాజరై.. అక్కడ తాను గ్రహించిన విషయాలను ఫిబ్రవరి 10న పీవీ సునీల్ కుమార్ ఫేస్ బుక్‌లో పోస్టు చేశారు. ఆ పోస్టు స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన హర్ష కుమార్.. ఆయన ఆర్ఎస్ఎస్ అని అర్థమైపోతుందన్నారు. అనంతరం ఫేస్ బుక్‌లో వీడియో పోస్టు చేసిన హర్ష కుమార్.. ముందు జాగ్రత్తగా జాతిని హెచ్చరిస్తూ తాను ఈ పోస్టు చేశానన్నారు. "పీవీ సునీల్ నాకు బాగా తెలిసినాయనే. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఆయన ఒకసారి నా దగ్గరికి వచ్చారు. గుంటూరు ఐజీ ఖాళీగా ఉందని, వేయించమని కోరారు. నేను సీఎంతో మాట్లాడి వేయించాను. వేయించలేదని బైబిల్ పట్టుకొని ప్రమాణం చేయమని సునీల్ కుమార్‌ను చెప్పమనండి. తర్వాత మా మధ్య సంబంధాలు లేవు. రఘురామకృష్ణను కొట్టినప్పుడు.. అది తప్పు కాబట్టి నేను రఘురామ వైపు మాట్లాడి .. సునీల్ కుమార్ తీరును తప్పుబట్టాను. పీవీ సునీల్ కుమార్ ఆర్ఎస్ఎస్ గురించి చేసిన పోస్టును ఎవరో నాకు పంపించారు. బౌద్ధ ఆచారాల ప్రకారం సునీల్ కుమార్ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారని నాతో ఒకరు చెప్పారు. దీంతో చింతలపూడిలో నాకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి అడిగితే.. బౌద్ధ సంప్రదాయం ప్రకారం సునీల్ తండ్రి అంత్యక్రియలు చేసిన మాట నిజమేనని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఇతణ్ని ప్రమోట్ చేస్తుందనే అనుమానం వచ్చేలా నాకు చాలా పోకడలు కనిపించాయి. అందుకే జాతిని ముందే మేల్కొలపాలనే ఉద్దేశంతోనే ఈ పోస్టు పెట్టాను. సునీల్ కుమార్ తన భార్యను హింసించడంతో ఆమె కేసు పెట్టింది. ఆయనపై ఆర్ఆర్ఆర్‌వి కాకుండా చాలా కేసులు ఉన్నాయి' అని హర్ష కుమార్ వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ హర్ష కుమార్ చేసిన పోస్టు పట్ల సునీల్ కుమార్ పరోక్షంగా స్పందించారు. 'పైకి ట్రిపుల్ ఆర్ (రఘురామ కృష్ణరాజు)తో పోరాడుతున్నట్లు నటిస్తూ.. అతని ఏజెంట్లుగా పని చేస్తున్నవాళ్లు దొరికిపోతున్నారు. వీళ్లను ఏం చేయాలో జాతికి తెలుసు' అని సునీల్ కుమార్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ఈ పోస్టు కింద సునీల్ కుమార్ అభిమానులు చేస్తున్న కామెంట్స్‌ను బట్టి ఆయన చేసిన ఈ పోస్టు హర్ష కుమార్‌ను ఉద్దేశించేదనని అర్థమవుతోంది. 'కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రణబ్ ముఖర్జీ లాంటి పెద్ద పెద్ద లీడర్లు సైతం ఆర్ఎస్ఎస్ ఆహ్వానం మేరకు ఆర్ఎస్ఎస్ సభలకు హాజరయ్యారని.. అంత మాత్రాన ప్రణబ్ ముఖర్జీ బీజేపీ మనిషి అయ్యారా? అప్పుడు హర్ష కుమార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వారిని విమర్శించలేని హర్ష కుమార్ గత చరిత్ర మరచి పీవీ సునీల్ గారి మీద బురద జల్లుతున్నారు. హర్ష కుమార్, ఆయన కుమారుడి రాజకీయ పీఠాలు కదులుతాయని భయమా? లేదా ఆర్ఆర్ఆర్‌కు కోవర్టులుగా పని చేస్తున్నారా?' అని ప్రభుదాస్ అనే వ్యక్తి పీవీ సునీల్ కుమార్ పోస్టు కింద కామెంట్ చేశారు. పీవీ సునీల్ కుమార్ ఇటీవల భీమవరం సభలో మాట్లాడుతూ.. చర్చికి వెళ్లినంత మాత్రాన, ఇంట్లో బైబిల్ ఉన్నంత మాత్రం క్రిస్టియన్లు కారని.. బాప్టిజం తీసుకున్న వారే క్రైస్తవులు అవుతారని వ్యాఖ్యానించారు. తన తండ్రి అంత్యక్రియలను క్రైస్తవ పద్ధతిలోనే చేశానని.. దమ్ముంటే తన ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ మీటింగ్ సక్సెస్ కావడంతో రఘురామ కోవర్టులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారని ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

# సత్తుపల్లి, కొవ్వూరు కొత్త లైన్ తో తగ్గనున్న దూరం

**ఏలూరు, జూన్ 15, పెన్ పవర్:**
తెలుగు రాష్ట్రాల మధ్య ప్రతిష్ఠాత్మకమైన సత్తుపల్లి–కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా రైల్వే బోర్డును కోరింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైల్వే శాఖకు భారీగా ఆదాయం సమకూరుతుందని, వ్యయంతో పోలిస్తే వచ్చే రాబడి 14 శాతానికి పైగానే ఉంటుందని ఏపీ ప్రభుత్వం తాజా నివేదికలో స్పష్టం చేసింది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు ఎఫ్ఐఆర్ఆర్ 10 శాతానికి పైగా ఉంటేనే రైల్వే శాఖ లాభసాటిగా భావిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి వాటా ఆశించకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే దీనిని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం రైల్వే బోర్డు ముందు ప్రతిపాదించింది. నిజానికి భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) నుంచి కొవ్వూరు వరకు రైల్వే లైన్ ప్రాజెక్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మంజూరైంది. అప్పట్లో ఈ ప్రాజెక్టు వ్యయంలో సగం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని రైల్వే శాఖ షరతు విధించింది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు నిధులు వెచ్చించేందుకు
తెలంగాణ ప్రభుత్వం ముందుకు రాలేదు. మరోవైపు సింగరేణి కాలరీస్ గనుల నుంచి బొగ్గు రవాణాను సులభతరం చేసేందుకు తెలంగాణ పరిధిలోని భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు ఇప్పటికే రైల్వే లైన్ నిర్మించారు. ఇప్పుడు సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు మిగిలిన 118.9 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మిస్తే ఈ కీలక అనుసంధానం పూర్తవుతుందని ఏపీ ప్రభుత్వం వివరిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్గంలో ఏపీ పరిధి 70.31 కిలోమీటర్లుగా ఉంది. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో ఏపీ ప్రభుత్వం సగం నిధులు ఇవ్వాలని లేదా కనీసం భూసేకరణ వ్యయాన్నైనా భరించాలని రైల్వే శాఖ గతంలో పట్టుబట్టింది. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఈ ప్రాజెక్టును కేంద్రమే చేపడుతుందని స్పష్టమైన హామీ ఉన్నందున.. రైల్వే శాఖే పూర్తి నిధులు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ లైన్ సాకారమైతే కొత్తగూడెం,
మణుగూరు ప్రాంతాల్లోని సింగరేణి గనుల నుంచి సేకరించే బొగ్గును కాకినాడ పోర్టుకు తరలించడానికి రైలు మార్గంలో సుమారు 140 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు భారీగా తగ్గడమే కాకుండా... సమయం కూడా ఆదా అవుతుంది. పారిశ్రామికంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున భూసేకరణతో పాటు అన్ని రకాల పరిపాలనాపరమైన సహకారం అందిస్తామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# కేడర్ లో నిర్లేపం, నిక్షిప్తత

**విజయవాడ,, జూన్ 15, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతుంది. తాము సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని చంద్రబాబు, లోకేశ్ లు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హామీల అమలు మాత్రం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు మరో పదిహేనేళ్లు తిరుగులేదంటూ జబ్బలు చరుచుకుంటున్నా జగన్ ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్నది మాత్రం నాయకత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకత్వం గతంలో మాదిరిగా ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే నివేదికలపైనే ఆధారపడి ఆల్ ఈజ్ వెల్ అని ఫీలవుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమలు వస్తున్నాయి. అందులో ఎవరూ కాదనలేరు. కానీ ఎవరూ అభివృద్ధిని చూసే ఓటేయరు. సంక్షేమం అందరికీ అందడం లేదు. నిధుల కొరత కారణంగా, అధికారులు కొర్రీలు పెడుతూ చాలామందికి కోతలు పెట్టారు. హామీలు అన్ని అమలు పర్చామంటూ డప్పాలు కొట్టుకుంటే సరిపోదు. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే చాలు జరుగుతున్న తప్పులు సరిదిద్దుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎమ్మెల్యేల సమావేశం పెట్టినా, కార్యకర్తలతో మీటింగ్ లు పెట్టినా చెప్పడమే తప్ప వినడం తక్కువ కావడంతో వారి నుంచి ఫీడ్ బ్యాంక్ తీసుకోకపోవడమే ప్రధాన సమస్య. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తమ సమస్యలన్నీ తీరతాయి భావించిన కార్యకర్తలకు నిరాశ ఎదురవుతుంది. మరొకవైపు కాలరెత్తుకుని కార్యకర్తలు తిరగొచ్చని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని ప్రజలకు చెప్పమని చంద్రబాబు అంటున్నా సగటు తెలుగుదేశం కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. నిన్నా మొన్నా వైసీపీ నుంచి వచ్చి చేరిన వారికి లభించే గౌరవం కూడా తమకు దక్కడం లేదంటూ నిట్టూరుస్తూన్నారు. ఆవేదనకు రెండేళ్లు, అసంతృప్తికి రెండేళ్లు, అంటూ తమలో నివురుగప్పిన నిప్పులా దాగున్న బాధను పంటికింద భరిస్తూ, లేని ఆనందాన్ని ముఖంలో నింపుకుంటూ ప్రజల్లోకి వెళ్లేదేలా? అని మనసులోనే కుమిలి పోతున్నారు. కక్కలేక మింగలేక మౌనం పాటిస్తున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం నాయకత్వం మేల్కొని క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను గమనించాలని కోరుతున్నారు. తమ కష్టాన్ని గుర్తించాలని కార్యకర్తలు వేడుకుంటున్నారు.

# దువ్వాడ దారెటు...

**విజయనగరం , జూన్ 15, పెన్ పవర్:** రీల్స్ "రాజా" పరిస్థితి దారుణంగా మారిపోయింది. పుట్టింటి వాళ్ళు వదిలేశారు. నమ్ముకున్న పార్టీ తరిమేసింది.. అన్నట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. తాడేపల్లి నుంచి క్లియర్ మెసేజ్ వచ్చింది. రీ ఎంట్రీ లేదని అన్ని మూసుకొని కూర్చోవాలని.. పార్టీ అధిష్టానం చెప్పేసింది. ఇప్పుడు ఏం చేయాలి.. చీరలు అమ్ముకుంటూ.. రీల్స్ చేసుకుంటూ బతకాలి.. ఇది ఆ సిట్టింగ్ ఎమ్మెల్సీ పరిస్థితి. ఉత్తరాంధ్రలో దువ్వాడ శ్రీనివాస్ కు ఒకప్పుడు భారీగానే ఫాలోయింగ్ ఉండేది. ఫ్యాన్ పార్టీలో ఆయన ఎమ్మెల్సీ కూడా. ఆయన జీవితంలోకి మాధురి రావడంతో పరిస్థితి మారిపోయింది. రాజకీయంలో హత్యలు ఉండవు ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి అనే సామెత అతని ద్వారా మరోసారి నిరూపితమైంది. భార్యను.. ఇద్దరి పిల్లల్ని వదిలిపెట్టి ఆయన తన దారితను చూసుకున్నాడు. వృద్ధాప్యంలో యవ్వనం లాగా.. పడుచు కుర్రాడి లాగా రెచ్చిపోతున్నాడు. మాధురితో రీల్స్ చేయడం.. టీవీ చానల్స్ లలో ముద్దులు పెట్టడం.. ఇలా రకరకాల హంగామా చేస్తున్నాడు. దీనివల్ల 2024 లో పార్టీకి చాలావరకు డ్యామేజ్ జరిగింది. టెక్కలి నియోజకవర్గం లోనే కాకుండా.. ఉత్తరాంధ్ర మొత్తంలో పార్టీకి పెద్ద దెబ్బ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అప్పటికప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏమి చెప్పకపోయినప్పటికీ.. వచ్చి కలువు అన్నారు. అయితే ఇంతవరకు అపాయింట్మెంట్ దొరకలేదు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి క్లియర్ మెసేజ్ వచ్చేసింది. రీ ఎంట్రీ లేదని స్పష్టంగా వర్తమానం అందింది. వైసీపీలోకి మళ్ళీ వెళ్లడానికంటే ముందు శ్రీనివాస్ బిజెపి.. టిడిపి.. జనసేన నాయకులతో మంతనాలు జరిపారు. పార్టీలో చేర్చుకోవాలని వర్తమానం పంపించారు. ఏ పార్టీ నుంచి కూడా సరైన స్థాయిలో స్పందన రాలేదు. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ గేటు కాదు కదా కనీసం ప్రహరీ గోడ కూడా టచ్ చేయడానికి అవకాశం లేదని వర్తమానం అందడంతో శ్రీనివాస్ అంతర్మదనంలో ఉన్నారు. ఆయన సన్నిహితురాలు ప్రస్తుతం హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆయన కూడా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అన్ని పార్టీలు డోర్లు క్లోజ్ చేయడంతో.. శ్రీనివాస్ ఏం చేస్తారు.. ఇండిపెండెంట్గా రంగంలోకి దిగుతారా.. లేక రీల్స్ చేసుకుంటూ.. సోషల్ మీడియా ఛానల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటూ వెళ్తారా అనేది చూడాల్సి ఉంది..

# వీడని జ్ఞానేశ్వరి అదృశ్యం మిస్టరీ..

# రంగంలోకి పవన్!

**కాకినాడ, జూన్ 15, పెన్ పవర్:** కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. : చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన మిస్టరీ ఇంకా వీడడం లేదు. ఆ చిన్నారి అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తోంది. వందలాది మంది పోలీసులు జల్లెడ పడుతున్నారు. కానీ ఇంతవరకు ఆచూకీ లేదు. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై ఆరా తీసారు. కాకినాడ ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కనుకునేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీస్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో పాటు ఎన్టీఆర్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. దట్టమైన అడవుల్లో సైతం వెళ్ళగలిగే అటవీ శాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంపు వాచర్స్, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని కూడా ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు పలుమార్లు గాలింపు చర్యలు చేపట్టినా చిన్నారి ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. చిన్నారి కనిపించకుండా పోయినప్పటి నుంచి ఆమె కోసం అన్ని దిశల్లో అన్వేషణ కొనసాగుతోంది. పాప సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న అధికారులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన హనుమాన్ టీం రంగంలోకి దిగింది. నిన్న అర్ధరాత్రి నుంచే అటవీ ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించిన బృందాలు అడవిలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. చిన్నారి జాడ కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రెండు థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. రాత్రి సమయంలో కూడా స్పష్టమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ డ్రోన్లు సహాయపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా అడవిలోని పొదలు, లోయలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు, హనుమాన్ టీం సభ్యులు కలిసి విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగిస్తున్నారు. చిన్నారి ఎక్కడైనా చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో ప్రతి ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. అటవీశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, ఆ ప్రాంతంలో మనుషులపై దాడి చేసే క్రూర జంతువులు ఉండే అవకాశం చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. దీంతో చిన్నారి క్షేమంగా ఉండే అవకాశాలపై ఆశాభావం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం కొనసాగుతున్న ఈ సెర్చ్ ఆపరేషన్‌పై స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే పాప జాడ లభించాలని అందరూ ప్రార్థిస్తున్నారు.

**పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి..**

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. 8 రోజులు దాటుతున్న ఆచూకీ దొరకకపోవడంతో పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాదాపు 400 మంది పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు పాల్గొంటున్నారు. అత్యాధునిక డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. చిన్నారితో పాటు కనిపించకుండా పోయిన కుక్క ప్రత్యక్షం కావడంతో.. దానికి జిపిఆర్ఎస్ కట్టి అడవుల్లో వదిలారు.. అయినా సరే ఎటువంటి ఫలితం లేకపోయింది. అయినా సరే ప్రయత్నాల్లో ఉంది పోలీస్ శాఖ. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపారు. కాకినాడ ఎస్పీకి నేరుగా ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అయితే పోలీస్ శాఖ గత ఎనిమిది రోజులుగా చేపట్టిన దర్యాప్తును వివరించారు కాకినాడ జిల్లా ఎస్పీ. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించామని ఎస్పీ వివరించారు. కాగా జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో కీలకంగా మారిన పెంపుడు కుక్క ఊహించని రీతిలో చనిపోయింది. గత రెండు రోజులుగా విచిత్రంగా ప్రవర్తించిన ఆ కుక్క.. చివరకు శనివారం చనిపోయింది. చిన్నారితో పాటుగానే ఈ కుక్క కనిపించకుండా పోయింది. నాలుగు రోజుల కిందట తిరిగి వచ్చింది. చిన్నారి ఇంటి వద్దకు చూసి కంగారుతో అడవిలోకి పారిపోయింది. అతి కష్టం మీద ఆ కుక్కను బంధించారు. ఆ కుక్కకు జిపిఎస్ ట్రాకర్ అమర్చి చిన్నారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కాగా.. శనివారం కుక్క సైతం చనిపోవడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# అక్బర్ బాగ్ లో ఉద్రిక్తత

## హిందూ సంఘాల అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పాతబస్తీ చదర్ ఘట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్బాగ్లో బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో బట్టలు ఆరేయడాన్ని దేవాలయానికి చెందిన కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కొందరు యువకులు దేవాలయ కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటన తెలుసుకున్న హిందూ సంఘాలు వందల సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ నాయకులు వీరేందర్ యాదవ్, వినోద్, నరసింహ, రాజేష్, బి ర్ స్ నాయకులు శ్రీధర్ రెడ్డి, బస్తి వాసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితుల ఫిర్యాదు తో చదర్ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. అక్బర్ బాగ్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి దేవాలయం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు....

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# చైనా తో.. భారత్-భారత్ తో ఏపీ పోటీ పడుతున్నాం: చంద్రబాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** అభివృద్ధి విషయంలో ఏపీ దూసుకుపోతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. చైనాతో భారత దేశం పోటీ పడుతుండగా.. భారత దేశంతో చైనా పోటీ పడుతోందని ఆయన తెలిపారు. పెట్టుబడులు, పారిశ్రామిక రంగాల్లో ఏపీకి భారీ ఎత్తున కంపెనీలు వస్తున్నాయన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా.. స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టుల(స్టార్టప్‌ల పెట్టుబడిదారులు)తో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే సమన్వయం చేయగా.. దీనిలో మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబా బు భారత్ సహా ఏపీలోని పెట్టుబడులకు అనుకూల అవకాశాలను వివరించారు. గత 12 సంవత్సరాలుగా భారత్ లో అనేక సంస్కరణలు వచ్చాయని .. ప్రస్తుతం అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందని, కానీ భారత్‌కు అంత సమయం పట్టటం లేదని అన్నారు. వైద్య సాంకేతికతలో.. ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు తెలిపారు. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఏపీలో సంస్కరణలు తీసుకువస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ఈ క్రమంలో ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త నినాదంతో పనిచేస్తున్నామన్నారు. భూ సేకరణ స్థానంలో సమీకరణను తీసుకువచ్చామని.. దీనికి రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. రాజధాని అమరావతికి 33 వేలకు పైగా ఎకరాల భూమిని సముపార్జించామన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా దీనిని డెవలప్ చేస్తున్నామని చెప్పారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు . పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయమని,. పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక సెజ్‌లను అభివృద్ధి చేశామన్నారు. అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు.

# నాడు కేసీఆర్.. నేడు కిషన్ రెడ్డి.. మెట్రో సైంధవులు: రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత పదేళ్ల పాలనలో కేసీఆర్.. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి.. మెట్రో రైలు విస్తరణకు అడు పడుతున్నారని.. సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. వీరిద్దరు సైంధవుల్లా మారి మెట్రోకు అతీగతీ లేకుం డా చేస్తున్నారని విమర్శించారు. మెట్రో విస్తరణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభు త్వంలో మెట్రో విస్తరణ ప్రజల కోసం కాదని.. కొందరి కోసం చేపట్టారని సీఎం విమర్శలు గుప్పించారు. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో నే మెట్రో పనులు చేపట్టారని గుర్తు చేశారు.

కానీ, కేసీఆర్ వచ్చిన తర్వాత.. అలైన్‌మెంట్లు మార్చి.. దానిని గందరగోళానికి గురి చేసి.. ఆలస్యం చేశా రని అన్నారు. తద్వారా.. మెట్రో పనులు ఆలస్యమై.. 7 వేల కోట్ల రూపాయలు అదనంగా భారం పడింద న్నారు. అయినా.. మెట్రో ప్రజల కోసం పెద్దగా ప్రయోజనాలు చేకూర్చిందా? అనేది ఆలోచించాల్సి న విషయంగా చెప్పారు. నాడు కేసీఆర్ అలా చేస్తే.. నేడు.. కేంద్ర మంత్రిగా, సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కిషన్ రెడ్డి కూడా మెట్రోకు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. మెట్రో విస్తరిస్తే.. ఆ క్రెడిట్ కాంగ్రెస్‌పార్టీ ఖాతాలో పడుతుందని.. దీనివల్ల తెలంగాణలో బీజేపీ భూస్థాపి తం అవుతుందని కిషన్ రెడ్డి బలంగా నమ్ముతున్నారని వ్యాఖ్యానించారు. అందుకే కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు చెప్పి.. రెండో దశ మెట్రో విస్తరణ పనులకు రుణం దక్కకుండా చేస్తున్నారని సీఎం ఆరోపించా రు. ఇలా చేయడం సమంజసమా? అని నిలదీశారు. కేసీఆర్ నిర్వాకంతోనే ఎల్.. అండ్ టీ సంస్థ.. తమకు నష్టాలు వచ్చాయని పేర్కొందన్నారు. ఏటా రూ.400 కోట్ల రూపాయలకు పైగా నష్టం వస్తోందని చెప్పినట్టు తెలిపారు. దీంతో రెండో దశ నుంచి ఎల్.. అండ్ టీ సంస్థ తప్పుకొందన్నారు. ఫలితంగా 15 వేల కోట్లకు మెట్రో కొనుగోలు చేసి.. రెండో దశ విస్తరణకు ముందుకు అడుగులు వేశామన్నారు. దీనికి గాను రుణం తీసుకునేందుకు ప్రయత్నించినట్టు తెలిపారు. ఐఆర్ ఎఫ్ సీ కింద.. 13 వేల కోట్ల రూపాయలను రుణంగా తీసుకునేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాక. కొంతమేరకు ఫీజులు కూడా చెల్లించిన తర్వాత.. దీనిని నిలుపుదల చేశారని.. దీనివెనుక కిషన్ రెడ్డి ఉన్నారని సీఎం ఆరోపించారు.

# లైవ్ లో చెంపదెబ్బ.. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. విద్యావ్యవస్థలో లోపాలను సరిదిద్దాలనే డిమాండ్ తోపాటు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ తో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాజస్థాన్ లోని జైపూర్ లో సోమవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి అభిజిత్ దీప్కే హాజరయ్యారు. అభిమానులు ఆయనను భుజాలపై మోసుకుని వెళుతుండగా, ఓ వ్యక్తి అభిజిత్ ను ముందుకు లాగి చెంపపై కొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ ఊహించని పరిణామంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర గందరగోళం, ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఆగ్రహానికి గురైన అభిజీత్ మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తిని పట్టుకున్నారు. అతడిపై ప్రతిదాడి చేశారని అంటున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బందోబస్తులో ఉన్న పోలీసులు తక్షణమే రంగప్రవేశం చేసి అదుపు చేశారు. దాడికి పాల్పడిన యువకుడిని నిరసనకారుల నుంచి రక్షించి, తమ అదుపులోకి తీసుకున్నారు.సోషల్ మీడియా వేదికగా నెటిజన్ల మద్దతు కూడగట్టుకున్న కాక్రోచ్ జనతా పార్టీ, ఇప్పుడు క్షేత్రస్థాయి పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటోంది. ఈ నెల 6వ తేదీన ఢిల్లీలో విద్యావ్యవస్థ లోపాలపై సిజెపి నిర్వహించిన ఆందోళన కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఢిల్లీ నిరసనల స్ఫూర్తితో ఇప్పుడు వివిధ రాష్ట్రాల్లోనూ వరుస ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే జైపూర్ వేదికగా జరిగిన ఆందోళనలో ఈ దాడి ఘటన జరగడం సంచలనంగా మారింది.ప్రస్తుతం పోలీసులు నిందితుడిని విచారిస్తున్నారు. అభిజీత్ దీప్కేపై దాడి చేయడానికి గల కారణాలు ఏంటి? దీని వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. ఈ దాడిని సిజెపి నాయకులు, మద్దతుదారులు తీవ్రంగా ఖండిస్తున్నారు. కాగా, ఈ పరిణామంపై నెటిజన్లు ఘాటుగా స్పందిస్తున్నారు. మరోవైపు కాక్రోచ్ పార్టీ రాజకీయ అజెండాను అమలు చేయడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విద్యావ్యవస్థలో లోపాలు సరిదిద్దాలనే కాక్రోచ్ పార్టీ డిమాండ్ ను అంతా సమర్థిస్తున్నా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పట్టుబడుతుండటంపై ఓ వర్గం ఆక్షేపిస్తోందని చెబుతున్నారు. కాగా, జైపూర్ ధర్నాలో అభిజిత్ పై దాడి చేసిన వ్యక్తి వివరాలు పోలీసులు ఇంకా వెల్లడించలేదు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దాడి చేయడానికి కారణాలు ఏంటి? అన్న వివరాలు ఆరా తీయనున్నారని అంటున్నారు.

# వంద శాతం ఇథనాల్.. పెట్రోల్ కి పూర్తి ప్రత్యామ్నాయం.. లాభమా? నష్టమా?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఇంధన, ఆటోమొబైల్ రంగాల్లో చరిత్రాత్మక మార్పుకు నాంది పడింది. దేశంలో కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, విదేశీ ముడిచమురు దిగుమతుల భారాన్ని వదిలించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక ముందడుగు వేసింది. వంద శాతం ఇథనాల్ నిబంధనలకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా 'ఈ100' ఇంధనంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో మారుతి సుజుకి, టొయోటా, ఎంజీ, హ్యుందాయ్ వంటి దిగ్గజ ఆటోమొబైల్ సంస్థలు ఈ100 ఇంధనంతో నడిచే వాహనాలను తయారు చేసేందుకు లైన్ కడుతున్నాయి.




### అసలు 'ఈ-100' అంటే ఏమిటి?

సాధారణంగా మనం వాడే పెట్రోల్‌లో కొంత శాతం ఇథనాల్ కలుపుతారు. ప్రస్తుతం భారత్‌లో 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ కలిపిన 'ఈ20' ఇంధనాన్ని వాడుతున్నాం. కానీ, ఇప్పుడు కేంద్రం అనుమతించిన 'ఈ100' అంటే.. ఇందులో అసలు సాంప్రదాయ పెట్రోలే ఉండదు! ఇది దాదాపు 100 శాతం స్వచ్ఛమైన ఇథనాల్‌తో కూడిన ఇంధనం. చెరకు, మొక్కజొన్న, పాడైపోయిన ఆహార ధాన్యాలు, వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారుచేసే పునరుత్పాదక ఇంధనమే ఈ ఇథనాల్.

### ఎందుకు ఇంత మొగ్గు?

మన దేశం ముడిచమురు అవసరాల కోసం ఎక్కువగా విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మారిన ప్రతిసారీ దేశ ఆర్థిక వ్యవస్థపై ఆ ప్రభావం పడుతోంది. ఈ100 ఇంధనాన్ని వాడటం వల్ల విదేశాల నుంచి కొనే ముడిచమురు భారం భారీగా తగ్గుతుంది. ఇథనాల్ తయారీకి చెరకు, మొక్కజొన్న వంటి పంటలు కావాలి కాబట్టి, వీటికి మార్కెట్లో డిమాండ్ పెరిగి అన్నదాతలకు మంచి లాభాలు వస్తాయి. సాంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే ఇథనాల్ వల్ల కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గి, గాలి కాలుష్యం అదుపులోకి వస్తుందని చెబుతున్నారు.

### పెట్రోల్ స్థానాన్ని భర్తీ చేయగలదా?

ఈ100 ఇంధనం పెట్రోల్ స్థానాన్ని భర్తీ చేయగలదు కానీ.. భారత మార్కెట్లో ఇది ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని చెబుతున్నారు. ఎందుకంటే ప్రస్తుతం రోడ్లపై ఉన్న సాధారణ వాహనాలు 'ఈ20' ఇంధనానికి మాత్రమే సపోర్ట్ చేస్తాయి. వాటిలో నేరుగా ఈ100 పోస్తే ఇంజిన్ నడవదని అంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ఫ్లెక్స్-ఫ్యూయెల్' వాహనాలు అందుబాటులోకి రావాల్సి ఉందని చెబుతున్నారు. స్వచ్ఛమైన ఇథనాల్‌తో బండి నడవాలంటే ఇంజిన్‌ను ప్రత్యేకంగా రీ-డిజైన్ చేయాలి. ఇంజిన్ కాలిబ్రేషన్‌తో పాటు ఇంజెక్టర్లు, ఫ్యూయెల్ పంపులు, ఫ్యూయెల్ లైన్లలో మార్పులు అవసరమవుతాయి. ఇప్పటికే మారుతీ సుజీకి సంస్థ తన ప్రముఖ 'వ్యాగన్-ఆర్' కారును ఫ్లెక్స్-ఫ్యూయెల్ మోడల్‌గా రూపొందించింది. మిగతా కంపెనీలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి.

కేంద్ర నిర్ణయం అద్భుతమైనదే అయినప్పటికీ, ఇందులో కొన్ని ప్రాక్టికల్ ఛాలెంజెస్ ఉన్నాయని అంటున్నారు. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌కు శక్తి తక్కువ. దీనివల్ల వాహనాల మైలేజ్ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయే అవకాశం ఉంది. ఇథనాల్‌కు వాతావరణంలోని తేమను గ్రహించే గుణం ఎక్కువ. దీనివల్ల ఇంజిన్ లోపలి భాగాలు త్వరగా తుప్పు పట్టే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బంకుల్లో ఈ100 ఇంధనాన్ని నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను మార్చాల్సి ఉంటుంది. సవాళ్లు ఉన్నప్పటికీ.. భవిష్యత్తు మాత్రం క్లీన్ ఎనర్జీదే అనడంలో సందేహం లేదు. కేంద్రం తీసుకున్న ఈ చరిత్రాత్మక నిర్ణయం భారతదేశాన్ని ఇంధన రంగంలో స్వయంసమృద్ధి వైపు నడిపిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.


## వంద శాతం ఇథనాల్.. పెట్రోల్ కి పూర్తి ప్రత్యామ్నాయం.. లాభమా? నష్టమా?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఇంధన, ఆటోమొబైల్ రంగాల్లో చరిత్రాత్మక మార్పుకు నాంది పడింది. దేశంలో కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, విదేశీ ముడిచమురు దిగుమతుల భారాన్ని వదిలించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక ముందడుగు వేసింది. వంద శాతం ఇథనాల్ నిబంధనలకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా 'ఈ100' ఇంధనంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో మారుతి సుజుకి, టొయోటా, ఎంజీ, హ్యుందాయ్ వంటి దిగ్గజ ఆటోమొబైల్ సంస్థలు ఈ100 ఇంధనంతో నడిచే వాహనాలను తయారు చేసేందుకు లైన్ కడుతున్నాయి.

### అసలు 'ఈ-100' అంటే ఏమిటి?

సాధారణంగా మనం వాడే పెట్రోల్‌లో కొంత శాతం ఇథనాల్ కలుపుతారు. ప్రస్తుతం భారత్‌లో 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ కలిపిన 'ఈ20' ఇంధనాన్ని వాడుతున్నాం. కానీ, ఇప్పుడు కేంద్రం అనుమతించిన 'ఈ100' అంటే.. ఇందులో అసలు సాంప్రదాయ పెట్రోలే ఉండదు! ఇది దాదాపు 100 శాతం స్వచ్ఛమైన ఇథనాల్‌తో కూడిన ఇంధనం. చెరకు, మొక్కజొన్న, పాడైపోయిన ఆహార ధాన్యాలు, వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారుచేసే పునరుత్పాదక ఇంధనమే ఈ ఇథనాల్.

### ఎందుకు ఇంత మొగ్గు?

మన దేశం ముడిచమురు అవసరాల కోసం ఎక్కువగా విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మారిన ప్రతిసారీ దేశ ఆర్థిక వ్యవస్థపై ఆ ప్రభావం పడుతోంది. ఈ100 ఇంధనాన్ని వాడటం వల్ల విదేశాల నుంచి కొనే ముడిచమురు భారం భారీగా తగ్గుతుంది. ఇథనాల్ తయారీకి చెరకు, మొక్కజొన్న వంటి పంటలు కావాలి కాబట్టి, వీటికి మార్కెట్లో డిమాండ్ పెరిగి అన్నదాతలకు మంచి లాభాలు వస్తాయి. సాంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే ఇథనాల్ వల్ల కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గి, గాలి కాలుష్యం అదుపులోకి వస్తుందని చెబుతున్నారు.

### పెట్రోల్ స్థానాన్ని భర్తీ చేయగలదా?

ఈ100 ఇంధనం పెట్రోల్ స్థానాన్ని భర్తీ చేయగలదు కానీ.. భారత మార్కెట్లో ఇది ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని చెబుతున్నారు. ఎందుకంటే ప్రస్తుతం రోడ్లపై ఉన్న సాధారణ వాహనాలు 'ఈ20' ఇంధనానికి మాత్రమే సపోర్ట్ చేస్తాయి. వాటిలో నేరుగా ఈ100 పోస్తే ఇంజిన్ నడవదని అంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ఫ్లెక్స్-ఫ్యూయెల్' వాహనాలు అందుబాటులోకి రావాల్సి ఉందని చెబుతున్నారు. స్వచ్ఛమైన ఇథనాల్‌తో బండి నడవాలంటే ఇంజిన్‌ను ప్రత్యేకంగా రీ-డిజైన్ చేయాలి. ఇంజిన్ కాలిబ్రేషన్‌తో పాటు ఇంజెక్టర్లు, ఫ్యూయెల్ పంపులు, ఫ్యూయెల్ లైన్లలో మార్పులు అవసరమవుతాయి. ఇప్పటికే మారుతీ సుజీకి సంస్థ తన ప్రముఖ 'వ్యాగన్-ఆర్' కారును ఫ్లెక్స్-ఫ్యూయెల్ మోడల్‌గా రూపొందించింది. మిగతా కంపెనీలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి.

కేంద్ర నిర్ణయం అద్భుతమైనదే అయినప్పటికీ, ఇందులో కొన్ని ప్రాక్టికల్ ఛాలెంజెస్ ఉన్నాయని అంటున్నారు. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌కు శక్తి తక్కువ. దీనివల్ల వాహనాల మైలేజ్ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయే అవకాశం ఉంది. ఇథనాల్‌కు వాతావరణంలోని తేమను గ్రహించే గుణం ఎక్కువ. దీనివల్ల ఇంజిన్ లోపలి భాగాలు త్వరగా తుప్పు పట్టే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బంకుల్లో ఈ100 ఇంధనాన్ని నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను మార్చాల్సి ఉంటుంది. సవాళ్లు ఉన్నప్పటికీ.. భవిష్యత్తు మాత్రం క్లీన్ ఎనర్జీదే అనడంలో సందేహం లేదు. కేంద్రం తీసుకున్న ఈ చరిత్రాత్మక నిర్ణయం భారతదేశాన్ని ఇంధన రంగంలో స్వయంసమృద్ధి వైపు నడిపిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఎయిర్‌టెల్ మాస్టర్ ప్లాన్: రూపాయి ఖర్చు లేకుండా ఆఫ్రికా బిజినెస్‌లో 79% వాటా సొంతం




టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. తమ అనుబంధ సంస్థ 'ఎయిర్‌టెల్ ఆఫ్రికా'లో వాటాను భారీగా పెంచుకునేందుకు దాదాపు 100 శాతం షేర్‌హోల్డర్స్ నుండి క్లీన్ అప్రూవల్ సాధించింది. సుమారు రూ.28వేల 220 కోట్ల విలువైన ఈ మెగా డీల్‌కు ఇన్వెస్టర్లు ఏకగ్రీవంగా జై కొట్టారు. కార్పొరేట్ గవర్నెన్స్‌లో సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసిన ఈ డీల్ వివరాలు ఇవే.. భారతీ ఎయిర్‌టెల్ ఈ డీల్ కోసం తన జేబులోంచి ఒక్క రూపాయి కూడా క్యాష్ తీయడం లేదు. ఇదే ఇక్కడున్న అసలైన ట్విస్ట్. ప్రమోటర్ గ్రూప్ సంస్థ అయిన 'ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్'కు భారతీ ఎయిర్‌టెల్ తన ఈక్విటీ షేర్లను ఇస్తుంది. దానికి బదులుగా ఆ సంస్థకు ఎయిర్‌టెల్ ఆఫ్రికాలో ఉన్న 16.31% వాటాను ఎయిర్‌టెల్ తన చేతుల్లోకి తీసుకుంటుంది. ఈ క్యాష్‌లెస్ షేర్-స్వాప్ పద్ధతి వల్ల కంపెనీపై ఎలాంటి అదనపు అప్పుల భారం పడదు, అలాగే చేతిలో ఉన్న నగదు కూడా ఖర్చు కాదు.

**ఆఫ్రికాలో ఇక ఎయిర్‌టెల్ రాజ్..**

ఈ మెగా లావాదేవీకి సంబంధించి అన్ని రెగ్యులేటరీ అనుమతులు పూర్తి కాగానే.. ఎయిర్‌టెల్ ఆఫ్రికాలో భారతీ ఎయిర్‌టెల్ ఎఫెక్టివ్ వాటా ప్రస్తుతమున్న 62.73% నుంచి ఏకంగా 79 శాతానికి పెరుగుతుంది. ఆఫ్రికా బిజినెస్ అనేది గ్రూప్ మొత్తం ఆదాయంలో భారీగా లాభాలను తెచ్చిపెడుతున్న హై-గ్రోత్ అసెట్. అందుకే అక్కడ హోల్డింగ్ పెంచుకోవడం ద్వారా కంపెనీ తన భవిష్యత్ లాభాలను మరింత పటిష్టం చేసుకుంటోంది.


**సునీల్ మిట్టల్ మాస్టర్ ప్లాన్..**

ఈ బిగ్ డీల్ సక్సెస్ అవ్వడంపై భారతి ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, చైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మాట్లాడుతూ.. తమ గ్రోత్ వ్యూహంలో ఆఫ్రికా మార్కెట్ చాలా కీలకమైందని చెప్పారు. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద 'షేర్ స్వాప్'గా నిలిచిన ఈ డీల్ ద్వారా తమ ప్రధాన వ్యాపార అవసరాలకు కావలసిన క్యాపెక్స్ ఏమాత్రం తగ్గకుండా కాపాడుకోగలిగాం. భవిష్యత్తులో ఆఫ్రికాలో ఇన్వెస్టర్లకు దీర్ఘకాలిక విలువను సృష్టించడానికి మరిన్ని అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. మొత్తానికి ఈ ప్లాన్‌తో ఎయిర్‌టెల్ తన షేర్ హోల్డింగ్ స్ట్రక్చర్‌ను మరింత పారదర్శకంగా మార్చేసి, మార్కెట్లో ఇన్వెస్టర్ల నమ్మకాన్ని గట్టిగా గెలుచుకుంది.

# మొక్కజొన్న, చెరకుతో ఇంధనం.. అసలు ఇథనాల్‌ను ఫ్యాక్టరీల్లో ఎలా తయారు చేస్తారో తెలుసా?

**మనం బండ్లలో కొట్టించే పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్నారని అందరికీ తెలుసు. కానీ, అసలు ఈ 'బయోఫ్యూయెల్' ఇథనాల్‌ను దేనితో తయారు చేస్తారు? ఫ్యాక్టరీల్లో దీన్ని ఎలా రెడీ చేస్తారు? అనే సీక్రెట్ ప్రాసెస్ చాలామందికి తెలియదు. మొక్కల నుంచి తీసే స్టార్చ్, షుగర్స్ సాయంతో.. ఒక పక్కా ప్లాన్ ప్రకారం 5 క్రేజీ స్టెప్స్‌లో ఈ ఇథనాల్‌ను తయారీ విధానం గురించి ఇప్పుడు తెలుసుకుందాం..**




**అసలు ఇథనాల్ దేని నుంచి వస్తుంది?**

ఇథనాల్ తయారు చేయడానికి బేసిక్ రా మెటీరియల్స్ ఏంటో తెలుసా? మన పొలాల్లో పండే మొక్కజొన్న, చెరకు. ఇవే కాకుండా పిండిపదార్థాలు, చక్కెర ఎక్కువగా ఉండే వేరే మొక్కలను కూడా ఇథనాల్ తయారీ కోసం వాడుతుంటారు.

ఇథనాల్ తయారీ వెనుక ఉన్న ఆ 5 క్రేజీ స్టెప్స్:

**1. మిల్లింగ్ & క్రషింగ్:**

ముందుగా ఫ్యాక్టరీకి వచ్చిన మొక్కజొన్న గింజలను మిషన్లలో వేసి పిండిలా గ్రైండ్ చేస్తారు. అదే చెరకు అయితే.. దాన్ని బాగా క్రష్ చేసి అందులో ఉండే నాచురల్ జ్యూస్‌ను బయటకు తీస్తారు.

**2. లిక్విఫాక్షన్ & స్టార్చ్ బ్రేకింగ్:**

ఇప్పుడు ఆ మొక్కజొన్న పిండికి నీటిని కలిపి ఒక మిశ్రమంలా మారుస్తారు. దీనికి కొన్ని ప్రత్యేకమైన ఎంజైమ్స్ కలిపి బాగా హీట్ చేస్తారు. ఈ హీట్ వల్ల మొక్కల్లో ఉండే కాంప్లెక్స్ స్టార్చ్ కాస్తా.. ఈజీగా కరిగే గ్లూకోజ్ షుగర్ లాగా మారిపోతుంది.

**3. ఫెర్మెంటేషన్:**

ఇది అసలైన కెమిస్ట్రీ మ్యాజిక్. ఆ షుగర్ మిశ్రమానికి ఈస్ట్ అనే సూక్ష్మజీవులను యాడ్ చేస్తారు. ఈ ఈస్ట్ 40 నుంచి 72 గంటల పాటు ఆ చక్కెరను మొత్తం ఆరగించేసి.. దాన్ని ఇథనాల్, కార్బన్ డై ఆక్సైడ్‌గా మార్చేస్తుంది. ఈ ప్రాసెస్ తర్వాత వచ్చే లిక్విడ్‌ను బీర్ అంటారు. ఇందులో దాదాపు 10% నుండి 18% వరకు ఆల్కహాల్ ఉంటుంది.

**4. డిస్టిలేషన్:**

ఇప్పుడు ఆ లిక్విడ్‌ను పెద్ద పెద్ద డిస్టిలేషన్ కాలమ్స్‌లో వేసి మరిగిస్తారు. నీటి కంటే ఆల్కహాల్ తక్కువ టెంపరేచర్ వద్దే ఆవిరి అయిపోతుంది కాబట్టి.. ఇథనాల్ ఆవిరిగా మారి పైకి లేస్తుంది. దాన్ని మళ్లీ కూల్ చేసి లిక్విడ్‌గా మారుస్తారు. ఈ స్టెప్ తర్వాత ఇథనాల్ 95% ప్యూర్ అవుతుంది.

**5. డీహైడ్రేషన్:**

బండ్లలో వాడే ఫ్యూయెల్‌లో అస్సలు నీటి చుక్క ఉండకూడదు. అందుకే ఈ 95% ప్యూర్ ఇథనాల్‌ను 'మాలిక్యులర్ సీవ్' (మైక్రోస్కోపిక్ హోల్స్ ఉండే స్పెషల్ గ్రాన్యూల్స్) గుండా పంపిస్తారు. ఇది అందులో ఉన్న మిగిలిన 5% నీటిని కూడా గుంజేసి.. 99% ప్యూర్, వాటర్-ఫ్రీ ఇథనాల్ వస్తుంది.

ఇలా తయారైన ప్యూర్ ఇథనాల్‌ను ఎవరైనా తాగేసే ప్రమాదం ఉంది కాబట్టి.. దీన్ని మార్కెట్లోకి పంపే ముందు ఇందులో కొద్దిగా పెట్రోల్ వంటి టాక్సిక్ పదార్థాలను కలుపుతారు. దీన్నే డీనేచరింగ్ అంటారు. దీనివల్ల అది తాగడానికి పనికిరాకుండా పోతుంది. ఆ తర్వాతే దీన్ని పెట్రోల్‌లో బ్లెండింగ్ చేయడానికి డిస్ట్రిబ్యూట్ చేస్తారు. సో ఇదన్నమాట మన బైక్ ట్యాంక్‌లోకి వచ్చే ఇథనాల్ తయారీ వెనుక ఉన్న అసలు స్టోరీ.

# ఇంటర్నెట్ స్పీడ్‌లో ఆ దేశాలదే హవా.. జపాన్‌కు కూడా షాక్ ఇచ్చిన నంబర్ 1 కంట్రీ ఏదో తెలుసా?





మనం వెబ్‌సైట్స్ బ్రౌజ్ చేయాలన్నా, ఏదైనా సినిమాలు, వీడియోలు స్ట్రీమ్ చేయాలన్నా, ఆన్‌లైన్ క్లాసులు వినాలన్నా, పెద్ద పెద్ద ఫైళ్లను డౌన్‌లోడ్ చేయాలన్నా.. వీటన్నిటికీ కావాల్సింది హై-స్పీడ్ ఇంటర్నెట్. హై-స్పీడ్ ఇంటర్నెట్ అనేది కేవలం మన ప్రతిరోజు కాలక్షేపానికే కాదు.. వ్యాపారాల వృద్ధికి, సరికొత్త డిజిటల్ ఆవిష్కరణలకు, ప్రపంచ సమాచారాన్ని వేగంగా అందుకోవడానికి చాలా కీలకం. మరి ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఇంటర్నెట్ అత్యంత వేగంగా ఉందో తెలుసుకోవడం ఎలా ? దీనికోసం నిపుణులు 'ఓక్లా స్పీడ్‌టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్' అండ్ 'స్టాటిస్టా' వంటి అంతర్జాతీయ సంస్థల నివేదికలను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇవి ప్రపంచవ్యాప్తంగా మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌ల సగటు వేగాన్ని లెక్కగడతాయి.

**మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్‌లో**

స్పీడ్‌టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్ ప్రకారం, 2025లో మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రపంచంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. ఇక్కడి మొబైల్ వినియోగదారులు ప్రపంచంలోనే అత్యధిక డౌన్‌లోడ్ స్పీడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.

**టాప్ ర్యాంకుల్లో ఉన్న మరికొన్ని దేశాలు**

ఖతార్: ప్రపంచంలోనే రెండవ అత్యంత వేగవంతమైన మొబైల్ ఇంటర్నెట్ ఇక్కడే ఉంది.

కువైట్: మొదటి మూడు స్థానాల్లో నిలిచింది.

బహ్రెయిన్, బ్రెజిల్, దక్షిణ కొరియా: ఇవి కూడా మొబైల్ స్పీడ్ టెస్టుల్లో టాప్ లో నిలిచాయి.

అయితే ఈ ర్యాంకింగ్‌లను నెట్‌వర్క్ వేగాన్ని కొలిచే అంతర్జాతీయ ప్రమాణమైన ఎంబీపీఎస్ (మెగాబిట్స్ పర్ సెకండ్) ఆధారంగా లెక్కించారు.

**ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో టాప్ దేశాలు**

మనం ఇళ్లు, ఆఫీసుల్లో ఉపయోగించే ఫైబర్, కేబుల్ లేదా ఇలా వంటి వైర్డ్ ఇంటర్నెట్ కనెక్షన్‌లను 'ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్' అంటారు. ఈ విభాగంలో సింగపూర్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ కలిగిన దేశంగా రికార్డు సృష్టించింది.

**బ్రాడ్‌బ్యాండ్ స్పీడ్‌లో టాప్ రేస్‌లో ఉన్న ఇతర దేశాలు చూస్తే:**

ఫ్రాన్స్: ప్రపంచంలోనే రెండో స్థానాన్ని దక్కించుకుంది.

యూఏఈ : మొబైల్‌లోనే కాదు, బ్రాడ్‌బ్యాండ్‌లోనూ ప్రపంచంలోనే టాప్-3 లో నిలిచింది.

అసలు కొన్ని దేశాల్లోనే ఇంటర్నెట్ ఎందుకు అంత వేగంగా ఉంటుందంటే

ఒక దేశంలో ఇంటర్నెట్ స్పీడ్ పెరగడానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉంటాయి:

అధునాతన మౌలిక సదుపాయాలు: ఫైబర్-ఆప్టిక్ నెట్‌వర్క్‌ల వంటి బలమైన కనెక్షన్లు ఉండటం.

టెక్నాలజీలో పెట్టుబడులు: లేటెస్ట్ 5+ లేదా 6+ టెక్నాలజీపై భారీగా ఖర్చు చేయడం.

భౌగోళిక పరిస్థితులు: జనాభా, ఆ దేశ విస్తీర్ణం కూడా నెట్‌వర్క్‌ను సులభంగా విస్తరించడానికి సహాయపడతాయి.

**జపాన్ టెక్నాలజీ అద్భుతమే.. కానీ**

ఇంటర్నెట్ అనగానే మనకు టెక్నాలజీ హబ్ అయిన జపాన్ గుర్తుకురావడం సహజం. ల్యాబ్‌లలో ప్రయోగాత్మకంగా సరికొత్త ఆప్టిక్ ఫైబర్ టెక్నాలజీని ఉపయోగించి డేటా స్పీడ్‌లో జపాన్ రీసెర్చర్స్ సరికొత్త ప్రపంచ రికార్డులు సృష్టించిన మాట వాస్తవమే. కానీ, సాధారణ ప్రజలు ప్రతిరోజు ఉపయోగించే సగటు ఇంటర్నెట్ స్పీడ్ విషయానికి వస్తే మాత్రం జపాన్ ప్రస్తుతం మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ రెండింటిలోనూ నంబర్ వన్ స్థానంలో లేదు. ఇక్కడ ఇంటర్నెట్ చాలా వేగంగా ఉన్నా... గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మాత్రం సింగపూర్, యూఏఈల కంటే వెనుకబడి ఉంది.

# రీల్స్ పిచ్చికి బ్రేక్.. యూకేలో అర్ధరాత్రి ఇంటర్నెట్ కర్ఫ్యూ.. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్




యూకేలోని పిల్లలకు సోషల్ మీడియా కష్టాలు మొదలయ్యాయి. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా బ్రిటన్ ప్రభుత్వం త్వరలోనే పూర్తి 'నిషేధం' విధించబోతోంది. దీంతో పాటు 18 ఏళ్లలోపు టీనేజర్ల కోసం అర్ధరాత్రి కర్ఫ్యూలు, రీల్స్ షార్ట్స్ చూసేటప్పుడు 'ఇన్ఫినిట్ స్క్రోలింగ్'కు బ్రేకులు వేసే అంశాలను కూడా పరిశీలిస్తోంది. ఒకవేళ ఈ నిర్ణయాలపై టెక్నాలజీ కంపెనీలు ఎదురు తిరిగితే.. గట్టిగా బుద్ధి చెబుతామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ హెచ్చరించారు.

ఈ నిషేధం పరిధిలోకి ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది పిల్లలు వాడే ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్ వంటి పాపులర్ యాప్స్ అన్నీ రాబోతున్నాయి. వీటితో పాటు ఆన్‌లైన్ గేమింగ్, లైవ్‌స్ట్రీమింగ్ సర్వీసుల ద్వారా పిల్లలు అపరిచిత వ్యక్తులతో మాట్లాడటాన్ని కూడా బ్యాన్ చేయనున్నారు. నిజ జీవితంలో మీ పిల్లలను ఎవరైనా తెలియని పెద్దవారితో ఒంటరిగా వదిలేస్తారా? లేదు కదా.. మరి ఆన్‌లైన్ ప్రపంచంలో అలా ఎలా వదిలేస్తారు? అందుకే ఈ కఠినమైన చర్యలు తీసుకుంటున్నాము అని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరికల్లా ఇందుకు సంబంధించిన రూల్స్ తీసుకొచ్చి.. వచ్చే ఏడాది స్ప్రింగ్ నాటికి పూర్తిగా అమలు చేయాలని యూకే ప్రభుత్వం భావిస్తోంది.

ఈ బ్యాన్‌తో పాటు టెక్ దిగ్గజాలైన యాపిల్, గూగుల్ కంపెనీలకు ప్రధాని స్టార్మర్ లండన్ టెక్ వీక్ వేదికగా ఒక అల్టిమేటమ్ జారీ చేశారు. స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లలో పిల్లలు న్యూడ్ ఫోటోలు పంపకుండా, రిసీవ్ చేసుకోకుండా డివైజ్ కంట్రోల్స్ యాక్టివేట్ చేయాలని ఆదేశించారు. ఇది పెద్ద అసాధ్యమైన పనేమీ కాదని.. ఒకవేళ టెక్ కంపెనీలు ఈ రూల్స్‌కు సహకరించకపోతే ఆయా కంపెనీల బాస్‌లు క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని గట్టిగా హెచ్చరించారు. పెద్దలు మాత్రం ఏజ్ వెరిఫికేషన్ ద్వారా తమ కంటెంట్‌ను చూసుకోవచ్చని తెలిపారు. టోటల్‌గా చెప్పాలంటే.. నయా సోషల్ మీడియా బ్యాన్ రూల్ పిల్లలను మరింత సురక్షితంగా, సంతోషంగా ఉంచడమే కాకుండా వారి భవిష్యత్తుకు మరిన్ని అవకాశాలను ఇస్తుందని యూకే ప్రభుత్వం నమ్ముతోంది.

# మే నెలలో టోకు ద్రవ్యోల్బణం 9.68%.. ఇంధన రంగంలో ఏకంగా 30% అప్




దేశంలో హోల్‌సేల్ మార్కెట్ లెక్కలు మారాయి. నిత్యావసర వస్తువుల నుంచి ఇంధనం వరకు ధరలు ఎలా మారుతున్నాయో లెక్కించే హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్(డబ్ల్యూపీఐ) పద్ధతిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అప్‌గ్రేడ్ చేసింది. ఇకపై పాత 2011-12 బేస్ ఇయర్ స్థానంలో.. సరికొత్త 2022-23 బేస్ ఇయర్ అమల్లోకి రానుంది. సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ కొత్త సిరీస్‌ను లాంచ్ చేసింది. గ్లోబల్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా మారిన ఈ కొత్త లెక్కల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**మే నెలలో హోల్‌సేల్ ఇన్ఫ్లేషన్ 9.68 శాతం..**

కొత్త బేస్ ఇయర్ లెక్కల ప్రకారం ఈ ఏడాది మే నెలలో దేశీయ హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 9.68 శాతంగా నమోదైంది. అన్ని కమోడిటీల డబ్ల్యూపీఐ ఇండెక్స్ 109.9 వద్ద నిలిచింది. అయితే ఇందులో సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టేలా ఫ్యూయల్ & పవర్ కేటగిరీల్లో ద్రవ్యోల్బణం ఏకంగా 30 శాతానికి దగ్గరగా నమోదు కావడం గమనార్హం. మాన్యుఫ్యాక్చర్ ప్రొడక్ట్స్ 7.48 శాతం, ప్రైమరీ ఆర్టికల్స్ 4.99 శాతం పెరిగాయి. క్రూడ్ పెట్రోలియం, మినరల్ ఆయిల్స్, కెమికల్స్, బేసిక్ మెటల్స్ ధరలు పెరగడమే ఈ హోల్‌సేల్ మంటకు ముఖ్య కారణంగా తేలింది. ఇక ఆహార ద్రవ్యోల్బణం మాత్రం 4.49 శాతంగా ఉంది.

ప్రభుత్వం కేవలం బేస్ ఇయర్ మార్చడమే కాదు.. ఇండెక్స్ బాస్కెట్‌ను కూడా భారీగా విస్తరించింది. ఒకప్పుడు కేవలం 697 వస్తువుల ధరలనే ట్రాక్ చేసేవారు. ఇప్పుడు ఆ లిస్టును 957 వస్తువులకు పెంచారు. దేశం డిజిటల్, గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది కాబట్టి.. హిస్టరీలోనే మొదటిసారిగా సోలార్ పవర్, విండ్ పవర్, న్యూక్లియర్ ఎనర్జీలను ఈ బాస్కెట్లోకి చేర్చారు. అలాగే క్రూడ్ ఆయిల్, నేచురల్ గ్యాస్ ప్రైమరీ ఆర్టికల్స్ నుంచి తీసేసి.. 'ఫ్యూయల్ అండ్ పవర్' గ్రూప్‌లోకి మార్చేశారు.

IMF సూచనల ప్రకారం.. సరికొత్త గ్లోబల్ టెక్నిక్స్, గ్రోస్ వాల్యూ ఆఫ్ అవుట్‌పుట్ పద్ధతిని వాడుతూ వెయిట్స్ కొత్త ఇండెక్స్‌లను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే పాత పద్ధతి నుంచి కొత్త ఫ్రేమ్‌వర్క్‌కు యూజర్లు అలవాటు పడటానికి వీలుగా.. రాబోయే 5 ఏళ్ల పాటు ఈ డబ్ల్యూపీఐ సిరీస్‌ను ఇలాగే పబ్లిష్ చేస్తారు. టోటల్‌గా చెప్పాలంటే.. దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి ప్రభుత్వం వేసిన ఈ 'న్యూ సిరీస్' మాస్టర్ స్ట్రోక్ అని చెప్పొచ్చు.

# ఈ ఐదు హ్యాబిట్స్ మీకు ఉంటే..

# మంచి ఆరోగ్యం సొంతం

## నిత్యం వ్యాయామాలు చేయాల్సిందే

## పోషకాహారం తీసుకోవాలి

## ప్రతి రోజూ 7-9 గంటల పాటు నాణ్యమైన నిద్ర

## ఒత్తిడి ఎక్కువ కాకుండా చర్యలు తీసుకోవాలి

ఆరోగ్యంగా ఉండాలని కోరుకోని వారు ఉండరు. కానీ, మిగతా విషయాల పట్ల ఉన్న శ్రద్ధ ఆరోగ్యం విషయంలో చూపించరు. దీంతో క్రమంగా ఆరోగ్యానికి నష్టం జరుగుతుంటుంది. నడి వయసుకే ఎన్నో ఆరోగ్య సమస్యలు మొదలవుతుంటాయి. సాధారణంగా 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు రావడం సహజం. కానీ 30-40 ఏళ్లకే ఆరోగ్యం విషయంలో సమస్యలు రావడం అంటే కచ్చితంగా శ్రద్ధ తీసుకోవాల్సిందే. 30-40 ఏళ్లకే వృద్ధాప్యపు ఛాయలు రాకూడదని కోరుకుంటే, 50 ఏళ్లు దాటినా నడి వయసు వారి మాదిరే యవ్వనంగా కనిపించాలంటే అదేమీ పెద్ద కష్టమైన విషయం కాదు. కాకపోతే కొన్ని చర్యలను పాటించాల్సి ఉంటుంది. వృద్ధాప్యంలో కణాలు దెబ్బతినడం, క్షీణించడం మొదలవుతుంది. కణాల మధ్య మెరుగైన కమ్యూనికేషన్ ప్రక్రియ బలహీనపడుతుంది. కొన్ని చర్యల ద్వారా ఈ ప్రక్రియలను నిలువరించామంటే యవ్వనంగా ఉండొచ్చు.

రోజువారీ వ్యాయామాలు జీవన విధానంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజుల పాటు, రోజుకు 30-45 నిమిషాల పాటు చేయాల్సి ఉంటుంది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, ఏరోబిక్ వ్యాయామాలు, జిమ్ లో కసరత్తులు ఏవైనా కావచ్చు. ముఖ్యంగా గుండె బలపడడానికి వ్యాయామాలు ఉంటాయి. వాటిని కూడా చేయాలి.

ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదో ఒకటి లేదంటే రుచికరమైనది తినేశామంటే కుదరదు. తీసుకునే ఆహారం ఏదైనా కానీ, అందులో పోషకాలు ఉండాలి. ముడి ధాన్యాలు, తృణ ధాన్యాలు, కూరగాయలు, ఆకుపచ్చని



కూరగాయలు తీసుకోవాలి. అదే సమయంలో చక్కెరలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, స్నాక్స్ తీసుకోకూడదు.

ఇక నాణ్యమైన నిద్ర చాలా అవసరం. రోజులో 7 నుంచి 9 గంటల వరకు నిద్ర పోవచ్చు. కాకపోతే ఈ నిద్ర కూడా కలత నిద్ర అవ్వకూడదు. అవాంతరాల్లేని నాణ్యమైన, గాఢనిద్ర అవ్వాలి. ఇందు కోసం నిద్రకు గంట ముందు నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వినియోగించకూడదు. పడకగదిలో వెలుతురు లేకుండా చూసుకోవాలి. నిద్రకు, రాత్రి భోజనానికి మధ్య 2 గంటల విరామం ఉండాలి.

ఒత్తిడి లేకుండా చూసుకోవడం కూడా ఆరోగ్యం పరంగా అత్యంత అవసరం. ఒత్తిడి ఎక్కువైపోతే కణాలకు నష్టం జరుగుతుంది.

మధుమేహం, బీపీ, కేన్సర్, గుండె జబ్బుల వంటి సమస్యలు స్ట్రెస్ వల్ల వస్తాయని ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. ఆదుర్దాగా కాకుండా కాస్త నిదానంగా పనులు చేసుకోవడం, సమయానికి ముందుగానే బయల్దేరడం, మెడిటేషన్, యోగాసనాలు స్ట్రెస్ నుంచి విముక్తి కల్పిస్తాయి.

ఇక సామాజిక సంబంధాలు కూడా మన ఆరోగ్యం విషయంలో ప్రభావం చూపిస్తాయి. మంచి స్నేహితులతో, కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపాలి.


# కిడ్నీల ఆరోగ్యానికి మంచి నీళ్ల సాయం... అంతా ఇంతా కాదు!

**జీవరాశి మనుగడకు కీలకంగా ఉన్న మంచినీరు**

**శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలంటున్న నిపుణులు**

**తగినంత నీరు తాగకపోతే యూరిక్ యాసిడ్ పేరుకుపోయే ప్రమాదం**

**కిడ్నీల్లో రాళ్లు, గౌట్ వంటి సమస్యలకు ప్రధాన కారణం యూరిక్ యాసిడ్**



భూమిపై జీవానికి ప్రాణాధారం నీరు. మనిషి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర నీటిదే. ముఖ్యంగా కిడ్నీల పనితీరుకు తోడ్పాటు అందిస్తూ మంచి నీరు అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అయితే, నీళ్లు కిడ్నీల ఆరోగ్యాన్ని ఎలా కాపాడతాయో చూద్దాం!

మానవ దేహంలోని వ్యర్థాలు మలమూత్రాల రూపంలో విసర్జితమవుతాయని తెలిసిందే. మూత్రం ద్వారా యూరిక్ యాసిడ్ వంటి ఘాటైన పదార్థాలు బయటికి పోతాయి. కొన్నిరకాల పదార్థాలు తిన్నప్పుడు, కూల్ డ్రింక్స్, మద్యం సేవించినప్పుడు శరీరంలో యూరిక్ యాసిడ్ అధిక మొత్తంలో పేరుకుపోతుంది. దీన్ని బయటికి పంపించే పని కిడ్నీలదే.

అయితే నీరు తక్కువగా తాగడం వల్ల శరీరంలో పెరిగిపోయిన యూరిక్ యాసిడ్ నిల్వలను కిడ్నీలు పూర్తిగా విసర్జించలేవు. దాంతో కిడ్నీలో రాళ్లు, గౌట్ వంటి కీళ్ల సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి సమస్యలతో వైద్యుల వద్దకు వెళితే, వారు వీలైనంత అధికంగా మంచినీళ్లు తాగమనే చెబుతారు. మంచినీళ్లు తాగడం వల్ల రక్తంలోని యూరిక్ యాసిడ్ పల్చబడుతుంది. అప్పుడది కిడ్నీల ద్వారా వడపోతలకు గురై వ్యర్థాలు మూత్రం ద్వారా వెలుపలికి వచ్చేస్తాయి. నీళ్లు సరిగా తాగకపోతే, మూత్రం మరింత గాఢతను సంతరించుకుంటుంది . కిడ్నీలు యూరిక్ యాసిడ్ ను వడపోయడంలో సమర్థవంతంగా పనిచేయలేవు. అలాంటప్పుడు యూరిక్ యాసిడ్ శరీరంలో అధిక మొత్తంలో పోగుపడుతుంది. అది ఘనీభవించి రాళ్లుగా మారుతుంది. ఇతర అనారోగ్య సమస్యలు కూడా మొదలవుతాయి.

శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉత్పత్తికావడానికి పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒబేసిటీతో బాధపడుతున్న వారిలో యూరిక్ యాసిడ్ స్థాయులు అధికంగా ఉంటాయని తెలిపారు. మంచినీళ్లు ఎక్కువగా తాగకపోవడం వల్ల ఆరోగ్యకరమైన శరీర బరువును కొనసాగించలేరని, ఇలాంటివాళ్లు బరువు పెరగడమో, ఊబకాయులుగా మారడమో జరుగుతుందని, దాంతో యూరిక్ యాసిడ్ తో కలిగే సమస్యల బారినపడుతుంటారని నిపుణులు వివరించారు. లేకపోతే కిడ్నీలపై విపరీతమైన భారం పడుతుందని, క్రమంగా ఇది కిడ్నీల వైఫల్యానికి దారితీస్తుందని వివరించారు. ఇలాంటి సమస్యల బారినపడకూడదనుకుంటే అందుకు నీళ్లే ఔషధం అని స్పష్టం చేశారు. నీళ్లు కిడ్నీల పనితీరునే కాకుండా, విషపదార్థాల ఏరివేతలో సహాయపడే కాలేయానికి తోడ్పాటునందిస్తాయని తెలిపారు. శరీరంలో హానికర పదార్థాల వడపోతకు సహకరించే ఏ అవయవానికైనా మంచి నీళ్లే మంచి మిత్రుడు అనొచ్చని పేర్కొన్నారు.



## సిగరెట్లు అప్పుడప్పుడు కాల్చినా

# తీవ్ర జబ్బుల ముప్పు

సిగరెట్లు రోజూ, చాలా ఏళ్లుగా తాగితేనే ఆరోగ్యానికి హానికరమని చాలామంది భావిస్తుంటారు. వారాంతాల్లోనో, వేడుకల్లోనో, ఒత్తిడికి గురైనప్పుడో ఒకటీ అరా కాల్చితే పెద్దగా ఇబ్బందేమీ ఉండదని అనుకుంటుంటారు. కానీ ఇలా అప్పుడప్పుడూ సిగరెట్లు కాల్చటమూ తీవ్ర జబ్బుల ముప్పు పెరగటానికి కారణమవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. పొగాకులో క్యాన్సర్ కారకాలు, విషతుల్య పదార్థాల వంటి 7వేలకు పైగా రసాయనాలుంటాయి. రోజూ తాగేవారికీ, అప్పుడప్పుడూ కాల్చేవారికీ మధ్య మోతాదులో తేడా ఉండొచ్చు గానీ హాని కారకాల ప్రభావం విషయంలో శరీరం ఈ వ్యత్యాసాన్ని విడమరచుకోలేదు. ఒకటి అరా కాల్చినా కీలక అవయవాలు, వ్యవస్థల మీద ప్రభావం పడుతుంది. పొగాకు నుంచి వెలువడే పొగకు గుండె రక్తనాళాల వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. పొగ తాగిన మరుక్షణంలోనే రక్తనాళాలు సంకోచిస్తాయి. గుండె వేగం, రక్తపోటు పెరుగుతాయి.

పొగలోని కార్బన్‌మోనాక్సైడ్ మూలంగా రక్తంలో ప్రసారమయ్యే ఆక్సిజన్ స్థాయులు తగ్గుతాయి. దీంతో గుండె మరింత బలంగా పనిచేయాల్సి వస్తుంది. అసలే పొగ అలవాటులేని వారితో పోలిస్తే అప్పుడప్పుడు సిగరెట్లు తాగినవారికీ గుండె జబ్బు ముప్పు గణనీయంగా పొంచి ఉంటున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. వీరికి గుండెపోటు ముప్పే కాదు.. పక్షవాతం, రక్తనాళాల లోపలి గోడ పొర దెబ్బతినటం, రక్తనాళాల్లో త్వరగా పూడికలు ఏర్పడటం, రక్తం గడ్డలు ఏర్పడటం వంటి ప్రమాదాలూ ఎక్కువే. లక్షణాలు బయటపడే సరికే లోపల జరగాల్సిన అనర్థం జరిగిపోతుంది. ఒక్క గుండె మాత్రమేనా? ఊపిరితిత్తులూ దెబ్బతింటాయి. క్యాన్సర్ల ముప్పూ పెరుగుతుంది. కాబట్టి సిగరెట్లు, చుట్టలు, బీడీల విషయంలో సురక్షితమైన మోతాదంటూ ఏదీ లేదని గుర్తుంచుకోవాలి.

# బ్యాలెన్స్ తప్పుతోందేం?



**సమస్య: నాకు 57 ఏళ్లు. బరువు 65 కిలోలు. రక్తపోటు, మధుమేహం లేవు. వృత్తిరీత్యా 20 నుంచి 30 కిలోల బరువులు మోస్తూ వచ్చాను. గత పదేళ్లుగా పాదాల అడుగు బాగం సున్నితంగా, స్పాంజిలా మారింది. కళ్లు తిరుగుతున్నట్టు, బ్యాలెన్స్ తప్పుతున్నట్టు అనిపిస్తుంది. సరిగా నిల్చోలేక, నడవలేకపోతున్నాను. దీనికి పరిష్కారముందా? ఎలాంటి చికిత్సలు తీసుకోవాలి?**

సలహా: మీరు తెలిపిన లక్షణాలను బట్టి నాడులు దెబ్బతిని ఉండొచ్చని అనిపిస్తోంది. సాధారణంగా మధుమేహం గలవారికి దీని ముప్పు ఎక్కువ. మీకు మధుమేహం లేదని అంటున్నారు. కాబట్టి ఇతరత్రా అంశాలేవైనా కారణమవుతున్నాయేమో చూడాలి. మీరు చాలాకాలంగా పెద్ద పెద్ద బరువులు మోస్తూ వచ్చానని అంటున్నారు. ఇలా ఎక్కువెక్కువ బరువులు మోసేవారికి వెన్నుపాములో డిస్కులు జారే ప్రమాదముంది. ఇవి నాడులను నొక్కటం వల్ల శరీర నియంత్రణ (బ్యాలెన్స్) కొరవడొచ్చు. దీంతో సరిగా నడవ లేకపోవటం, నిల్చో లేకపోవటం ఇబ్బంది కలిగిస్తాయి. కళ్లు తిరిగినట్టు అనిపించొచ్చు. అందువల్ల క్షుణ్నంగా పరీక్షించటం ముఖ్యం. అప్పుడే కారణమేంటో బయటపడుతుంది. వెన్నెముక ఎంఆర్ఐ స్కాన్ చేస్తే డిస్కులు ఎలా ఉన్నాయో తెలుస్తుంది. అవసరమైతే పాదాల వద్ద నర్వ్ కండక్షన్ పరీక్ష చేయాల్సి ఉంటుంది. కారణాన్ని బట్టి చికిత్స చేస్తే ఫలితం కనిపిస్తుంది. డిస్కులు జారి, నాడులను నొక్కుతున్నట్టయితే శస్త్రచికిత్సతో సరి చేయాల్సి ఉంటుంది. పాదాల్లో నాడులు దెబ్బతింటే మందులు అవసరమవుతాయి. విటమిన్ బి12 లోపం, రక్తహీనతతోనూ కళ్లు తిరిగినట్టు అనిపించొచ్చు. రక్త పరీక్ష చేస్తే ఇవి తెలుస్తాయి. విటమిన్ బి12, ఐరన్ లోపాలు ఉన్నట్టయితే మాత్రలతో సరిచేయొచ్చు. లోపం మరీ ఎక్కువగా ఉంటే ఇంజెక్షన్లు అవసరమవుతాయి.

# విరాట్ కోహ్లీ నిజంగానే అహంకారి.. రవి శాస్త్రి కామెంట్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మైదానంలో అడుగుపెడితే ఎలా ఉంటాడో క్రికెట్ ప్రేమికులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ఒక్కసారి గ్రౌండ్‌లోకి దిగిన తర్వాత కోహ్లీ బాడీ లాంగ్వేజ్ పూర్తిగా చేంజ్ అవుతుంది. ప్రత్యర్థి జట్టు కవ్వింపు చర్యలకు దిగితే వారి శైలిలోనే ఆన్సర్ ఇస్తాడు.. స్లెడ్జింగ్‌కు దిగిన వారికి దిమ్మతిరిగేలా కౌంటర్ ఇస్తాడు. అదే సమయంలో అంతే సరదాగానూ ఉండటం కోహ్లీకే చెల్లింది. కానీ, కొంతమంది మాత్రం విరాట్ కోహ్లీని అహంకారి, కోపిష్టి అంటూ విమర్శిస్తూ ఉంటారు. తాజాగా ఇదే తరహాలో కోహ్లీని విమర్శిస్తూ టీమిండియా మాజీ కోచ్ ఓ పోస్టు పెట్టారు.

**నిజంగానే కోహ్లీ అహంకారి:**

విరాట్ కోహ్లీని విమర్శిస్తూ వచ్చిన పోస్టుపై టీమిండియా మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి మాట్లాడుతూ.. అహంకారి, అతి గారాబం వల్ల చెడిపోయిన అల్లరిపిల్లాడు.. దూకుడు.. కోహ్లీ గురించి వాళ్లు అన్న ప్రతీ మాటలో నిజం ఉందన్నాడు. కానీ, ఇదంతా క్రికెట్ స్టేడియంలో ఉన్నంత వరకే. గ్రౌండ్ బయట విరాట్ ఇందుకు పూర్తి విభిన్నంగా ఉంటాడని వెల్లడించాడు. ఎక్కడ ఎలా ఉండాలో తెలిసిన వ్యక్తులంటే నాకు చాలా ఇష్టం.. స్టేడియంలో కింగ్ కోహ్లీ చూపించే అగ్రెషన్ క్రీడలో భాగమేనని శాస్త్రి పేర్కొన్నారు.

**కోహ్లీ- రవిశాస్త్రి మధ్య ప్రత్యేక అనుబంధం:**

రవిశాస్త్రి హెడ్‌కోచ్‌గా, కోహ్లీ కెప్టెన్‌గా ఉన్న సమయంలో భారత జట్టు అద్భుతమైన విజయాలు సాధించింది. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో నంబర్ వన్‌గా నిలిచి సత్తా చాటింది. ఆ తర్వాత ఈ ఇద్దరు తమ తమ పదవుల నుంచి తప్పుకున్నప్పటికీ, వారి మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే కొనసాగుతోంది. తాజాగా రవిశాస్త్రి చేసిన కామెంట్స్ తో ఈ విషయం మరోసారి రూజువైంది.

**వన్డే సిరీస్‌కు కింగ్ కోహ్లీ దూరం:**

ఇటీవలే ముగిసిన ఐపీఎల్-2026 లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) విజేతగా నిలవడంలో విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన కోహ్లీ.. ఆఫ్ఘనిస్తాన్‌తో స్వదేశంలో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని స్థానంలో యశస్వి జైస్వాల్ జట్టులోకి వచ్చాడు. మరోవైపు రవిశాస్త్రి ప్రస్తుతం కామెంటేటర్‌గా కొనసాన్నాడు.

# జూన్ 17న ఉదయం మ్యాచ్.. మధ్యాహ్నం మ్యాచ్.. రాత్రికి మరో మ్యాచ్.. భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ అభిమానులకు ఎల్లుండి (జూన్ 17న) పండగలాంటి రోజు అని చెప్పాలి.. ఎందుకంటే ఆ ఒక్క రోజే ఏకంగా మూడు క్రేజీ మ్యాచ్‌లు జరగబోతున్నాయి. ఉదయం నుంచి రాత్రి దాకా టీమిండియాకు సంబంధించిన వేర్వేరు జట్లు మైదానంలోకి దిగుతుండటంతో.. ఏకంగా 12 గంటల పాటు నాన్‌స్టాప్ క్రికెట్ ఎంటర్‌టైన్‌మెంట్ పక్కా అని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

**ఇండియా A' vs ఆఫ్ఘనిస్తాన్ 'A':**

ట్రై సిరీస్‌లో భాగంగా ఎల్లుండి ఉదయం 10:00 గంటలకే మొదటి మ్యాచ్ స్టార్ట్ అవుతుంది. ఇండియా 'ూ', ఆఫ్ఘనిస్తాన్ 'ూ' జట్ల మధ్య వన్డే (ాణ×) పోరు జరగబోతుంది. యంగ్ ప్లేయర్స్ తమ సత్తా చాటడానికి ఈ మ్యాచ్ ఎంతో కీలకం కానుంది.

**టీమిండియా VS ఆఫ్ఘనిస్తాన్:**

ఇక మధ్యాహ్నం నుంచి అసలైన హై-వోల్టేజ్ మ్యాచ్ ప్రారంభమైతుంది. మధ్యాహ్నం 1:30 గంటలకు ఆఫ్ఘనిస్తాన్ సీనియర్ జట్టుతో టీమిండియా తన రెండవ వన్డే (2అ ాణ×) మ్యాచ్‌లో తలపడనుంది. సీనియర్ల పోరు కావడంతో ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**భారత మహిళల జట్టు ఙం నెదర్లాండ్స్:**

పగలు మెన్స్ క్రికెట్ ముగిశాక, రాత్రి సమయంలో ఉమెన్స్ క్రికెట్ ధమాకా షురూ కాబోతుంది. మహిళల టి20 వరల్డ్ కప్ (ు20 ఔజ) లో భాగంగా రాత్రి 7:00 గంటలకు భారత మహిళల జట్టు నెదర్లాండ్స్‌ను ఢీకొట్టనుంది. వరల్డ్ కప్ పోరు కావడంతో మన అమ్మాయిల మ్యాచ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

దీంతో బుధవారం నాడు పొద్దున్న 10 గంటల నుంచి రాత్రి దాకా టీవీలు, మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోయేలా మొత్తం 12 గంటల నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ రెడీ అయింది. దీంతో ఆ రోజు అన్ని మ్యాచులని చూసేందుకు క్రికెట్ ఫ్యాన్స్ రెడీ అవుతున్నారు. మరీ చూడాలి జూన్ 17న భారత్ జట్టు అన్ని విభాగాల్లో గెలుస్తుందో లేదో అనేది.

# ఐపీఎల్‌లో ఊచకోత.. శ్రీలంకలో చేతులెత్తేసిన వైభవ్.. ఫ్లాట్ పిచ్ కాదురా బాటు అంటూ ట్రోలింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** : ఐపీఎల్ (IPL 2026) లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న 15 ఏళ్ల వండర్ కిడ్ 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకుని, క్రిస్ గేల్ పేరిట ఉన్న మోస్ట్ సిక్సర్స్ (72 సిక్సులు) రికార్డును బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ.. ప్రస్తుతం శ్రీలంక వేదికగా జరుగుతున్న వన్డే ట్రై-సిరీస్‌లో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నాడు. టీమిండియా 'A' తరఫున ఆడుతున్న ఈ యంగ్ ఓపెనర్.. వరుసగా 3 ఇన్నింగ్స్‌ల్లోనూ తక్కువ స్కోర్లకే అవుట్ కావడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు అతడిపై గట్టిగానే ట్రోలింగ్ నడుస్తుంది.

**వన్డేల్లో తడబడిన వైభవ్:**

తిలక్ వర్మ కెప్టెన్సీలోని భారత్ 'ూ' జట్టు ఈరోజు (సోమవారం) రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ.. చమిక గుణశేఖర వేసిన తొలి ఓవర్లోనే ఒక సిక్స్, రెండు ఫోర్లు బాది ఐపీఎల్ రేంజ్ అటాకింగ్ స్టార్ట్ చేశాడు. కానీ, శ్రీలంక 'ూ' కెప్టెన్, ఆఫ్-స్పిన్నర్ సహన్ అరాచ్చిగే బౌలింగ్‌లోకి రాగానే వైభవ్ తడబడ్డాడు. కేవలం 14 బంతుల్లో 21 పరుగులు (3 ఫోర్లు, 1 సిక్స్) చేసి ఔట్ అయ్యాడు.

**మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ ఫ్లాప్ షో:**

ఐపీఎల్‌లో 237.3 స్ట్రైక్ రేట్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ, ఈ వన్డే సిరీస్‌లో క్రీజులో అస్సలు నిలబడలేకపోతున్నాడు. శ్రీలంక 'ూ'తో జరిగిన మొదటి మ్యాచ్లో 12 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేయగా.. ఇక ఆఫ్ఘనిస్తాన్ 'ూ'తో జరిగిన పోరులో 22 బంతుల్లో 44 రన్స్ తో మంచి స్టార్ట్ వచ్చినప్పటికీ, దాన్ని భారీ స్కోరుగా మార్చుకోలేకపోయాడు. అలాగే మూడో మ్యాచ్ : 14 బంతుల్లో 21 రన్స్ మాత్రమే చేసి తన ఫ్లాప్ షోని కంటిన్యూ చేశాడు.

**సోషల్ మీడియాలో ట్రోల్స్:**

వైభవ్ వరుసగా విఫలం అవుతుండటంతో.. ఈ నెల చివర్లో జరగబోయే ఐర్లాండ్ సిరీస్‌కు, అలాగే జూలైలో ఇంగ్లాండ్ సిరీస్‌కు టీమిండియా మెయిన్ టీమ్‌కు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డ్ సృష్టించిన వైభవ్‌ను నెటిజన్లు టార్గెట్ చేస్తున్నారు. బాబోయ్.. ఇది ఐపీఎల్ ఫ్లాట్ పిచ్ కాదురా బాబు.. ఇంటర్నేషనల్ కండిషన్స్‌లో స్పిన్నర్లను ఎలా ఆడాలో నేర్చుకో, పవర్‌ప్లే ముగియకముందే ఔట్ అవ్వడానికి ఇది టీ20 కాదు, వన్డే మ్యాచ్.. కొంచెం నిలకడగా ఆడాలి అంటూ ఎక్స్ (X) లో ట్రోల్ చేస్తున్నారు.

**కోచ్ ఫుల్ సపోర్ట్:**

నెట్టింట ట్రోలింగ్ ఎలా ఉన్నా.. ఇండియా 'A' హెడ్ కోచ్ హృషికేష్ కణిత్కర్ మాత్రం వైభవ్‌కు అండగా నిలిచాడు. వైభవ్ చాలా చిన్న వయస్కుడైనప్పటికీ, తన బ్యాటింగ్, జట్టులో తన రోల్ ఏంటనేది అతనికి బాగా తెలుసు.. ఎవరైనా సలహాలు ఇస్తే వింటాడు, దానిని ప్రాక్టీస్ చేస్తాడు.. అతని బ్యాటింగ్ తీరు నాకు బాగా నచ్చిందంటూ కోచ్ పాజిటివ్‌గా స్పందించాడు.

మానస చౌదరి సంప్రదాయ శోభ: అరంగేట్రం నుండి వర్ధమాన తారగా...



# రష్మిక మందన్న మొదటి A-రేటెడ్ ఫిలిమ్



శ్రేయా ధన్వంతరి యొక్క బోల్డ్ గ్లో: తెలుగు అరంగేట్రం నుండిఌ స్టార్ వరకు



నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మొదటిసారి ఒక ఘాటైన రొమాంటిక్ -ఏ- రేటెడ్ సినిమాలో నటించారు. బాలీవుడ్ నటులు షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన -కాక్‌టెయిల్ 2- చిత్రానికి సెన్సార్ బోర్డ్ (జదీఖీజ) తాజాగా ాూ సర్టిఫికేట్ జారీ చేసింది. సాధారణంగా రష్మిక ఇప్పటివరకు నటించిన సినిమాలన్నీ ఖ లేదా యుఏ సర్టిఫికేట్‌లతోనే వచ్చాయి. గతంలో -యానిమల్- చిత్రానికి -ఏ- సర్టిఫికేట్ వచ్చినా.. అది భారీ రక్తపాతం, వయలెంట్ యాక్షన్ వల్ల వచ్చింది. కానీ ఇప్పుడు రానున్న -కాక్‌టెయిల్ 2- మాత్రం పూర్తిగా ఘాటైన శృంగార సన్నివేశాలు, రొమాంటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో నిండి ఉండటం వల్లే వయోజనులకు మాత్రమే (అడల్ట్స్ ఓన్లీ) అని సెన్సార్ బోర్డు తేల్చేసింది. ఈ శుక్రవారం -జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే కొన్ని పరిమిత స్క్రీన్లలో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి -ఏ- సర్టిఫికేట్ లభించిన విషయం వెలుగులోకి వచ్చింది. రష్మికతో పాటు గ్లామరస్ బ్యూటీ కృతి సనన్‌కు కూడా ఇది కెరీర్‌లో మొదటి అడల్ట్ ఫిల్మ్ కావడం గమనార్హం. ఈ చిత్రంలో కృతి సనన్ మునుపెన్నడూ చూడని బోల్డ్ - గ్లామ్ లుక్‌లో కనిపించనున్నారు. -తేరే ఇష్క్ మే- చిత్రంలో ఎంతో ఇంటెన్స్ రోల్ పోషించిన కృతి.. ఇందులో ఇలాంటి పూర్తి బోల్డ్ అవతారంలోకి మారడం చూసి అభిమానులు సైతం షాక్‌కు గురవుతున్నారు. గతంలో 2012లో వచ్చిన -కాక్‌టెయిల్- చిత్రం సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకోన్, డయానా పెంటిల మధ్య నడిచే ముక్కోణపు ప్రేమకథగా వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. ముఖ్యంగా ఆ సినిమా దీపికా పదుకోన్ కెరీర్‌ను మలుపు తిప్పింది. అయితే ఆ మొదటి భాగం సెకండ్ హాఫ్‌లో కాస్త మెలోడ్రామాగా మారినా... ఈ సరికొత్త సీక్వెల్ మాత్రం మొదటి నుండి చివరి వరకు చాలా కూల్‌గా, హాయిగా సాగిపోతుందని నిర్మాత దినేష్ విజన్ ట్రైలర్ లాంచ్‌లో వెల్లడించారు. అయినా థియేటర్లలో యూత్‌ను ఆకట్టుకునేలా ఇందులో బోల్డ్ సీన్స్ మోతాదు కాస్త గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా ట్రైలర్ - కథనం చూస్తే.. 2012 నాటి మొదటి భాగం టెంప్లేట్‌నే మేకర్స్ ఫాలో అయినట్లు స్పష్టమవుతోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ విపరీతమైన స్టైల్, అందమైన సముద్ర తీరాలు, హాట్‌నెస్ - సెక్సీనెస్ కవ్విస్తూనే ఉన్నాయి. అయితే ఈ ప్రోమో కేవలం గ్లామర్‌ను నమ్ముకుని కాస్త డొల్లగా ఉందనే విమర్శలు కూడా వస్తున్నాయి. సినిమాలో ఏదైనా బలమైన కంటెంట్ ఉందా లేదా అనేది కేవలం ట్రైలర్ చూసి ఇప్పుడే అంచనా వేయలేం. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉందని... ఇది ఒక క్వీర్ -స్వలింగ ప్రేమకథ అనే పుకార్లు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై క్లారిటీ రావాలంటే జూన్ 19 వరకు ఆగాల్సిందే. మొదటి భాగం -కాక్‌టెయిల్- అంతటి భారీ బ్లాక్‌బస్టర్ కావడానికి సంగీత దర్శకుడు ప్రీతమ్ అందించిన అద్భుతమైన పాటలు ఒక ముఖ్య కారణం. కానీ ఈ సీక్వెల్ చిత్రానికి సంబంధించిన ప్రోమో - సౌండ్‌ట్రాక్ మొదటి భాగం అంత ఆకట్టుకునేలా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా.. షాహిద్ కపూర్‌తో పాటు కృతి సనన్, రష్మిక మందన్నల బోల్డ్ అండ్ రొమాంటిక్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మరి ఈ ఘాటైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965